ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

నింగి నుంచీ నిఘా



చంద్రగిరి మండలం ఎం.రంగంపేట వద్ద డ్రోన్‌తో నిఘా

హమ్మయ్య.. ఊరు శివారుకు వచ్చాం. ఎవరూ చూడట్లేదు. రోడ్డు పక్కన.. ఆ చెట్టు కింద సిట్టింగ్ వేద్దామరి మద్యం సీసాలు ఓపెన్ చేస్తున్నారా? గంజాయి ప్యాకెట్లు విప్పుతున్నారా?

పోలీసుల్లేరు. సీసీ కెమెరాలూ లేవు. ఇష్టారాజ్యంగా వాహనాన్ని నడపవచ్చని అనుకుంటున్నారా? శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా.. గంజాయి అమ్మినా ఏమీ కాదనుకుంటున్నారా?



బహిరంగంగా మద్యం తాగుతూ డ్రోన్ కెమెరాకు చిక్కిన మందుబాబులు

ఇలాంటి వారందరిపైనా డ్రోన్లతో నిఘా పెట్టేందుకు పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. పోలీసులనుంచి తప్పించుకున్నా.. డ్రోన్లకు చిక్కాల్సిందే.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

జిల్లా పోలీసు శాఖలోనూ టెక్నాలజీని అంది పుచ్చుకుంటున్నారు. శాంతిభద్రతల వినియోగంలో డ్రోన్ల వినియోగం పెంచనున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక పోలీసుశాఖ సాంకేతిక నైపుణ్యంతో అసాంఘిక కార్యకలాపాల ఆటకట్టించడానికి చర్యలు తీసుకుంటోంది. జిల్లాకు నిత్యం దేశ, విదేశాల నుంచి దాదాపు లక్ష మంది యాత్రికులు, వీఐపీలు వస్తుంటారు. ఈ క్రమంలో భద్రతా చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఇక, జిల్లాలో తొమ్మిది సబ్ డివిజన్లు, 49 పోలీసు స్టేషన్లు, తిరుపతి, తిరుమలలో ట్రాఫిక్ స్టేషన్లు, మరో రెండు సెంట్రల్ క్రైం స్టేషన్లు, సైబర్ క్రైం కార్యాలయం వుంది. వీటన్నింటికీ కలిపి ప్రస్తుతం మూడు డ్రోన్లు మాత్రమే వున్నాయి. మరో 73 డ్రోన్లు కావాలని అధికారులు ప్రతిపాదనలు పెట్టారు. ఆ డ్రోన్లు వస్తే నింగి నుంచీ నిఘా పెట్టనున్నారు. జూదం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, మహిళలకు వేధింపులు, ట్రాఫిక్ సమస్య, శాంతి భద్రతల పరిరక్షణ, పండుగ సమయాల్లో బందోబస్తు నిర్వహణ, ఇతర నిఘా కార్యకలాపాలకు డ్రోన్లు వినియోగించనున్నారు. బస్టాండు, రైల్వే స్టేషన్ తదితర రద్దీ ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా పర్యవేక్షించనున్నారు. పోలీసులు వెళ్లలేని ప్రదేశాలకు వాటిని పంపి అక్కడ పరిస్థితులు సమీక్షిస్తారు. అసాంఘిక కార్యకలాపాలు, ఈవ్ టీజింగ్, ఒంటరిగా వెళ్ళే మహిళలను బెదిరించడం, చోరీలకు పాల్పడడం, చైన్ స్నాచింగ్‌లు చేస్తున్న వారికి డ్రోన్లతో చెక్ పెట్టనున్నారు. నేరాల విజువల్స్ డ్రోన్లలోని కెమెరాల్లో సేవ్ అవుతాయి. వాటి ద్వారా త్వరితగతిన దర్యాప్తు చేసే అవకాశం ఉంటుందని పోలీసు అధికారి ఒకరు చెప్పారు. కమాండ్ కంట్రోలు సెంటర్‌కు ఈ డ్రోన్లలోని కెమెరాలు అనుసంధానమై ఉంటాయి. ట్రాఫిక్ ఎందుకు జామ్ అయిందనేది వీటిద్వారా గుర్తించవచ్చు.

20 మంది సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

డ్రోన్ల ఆపరేటింగ్‌పై జిల్లాలో దాదాపు 20 మంది సిబ్బందికి ఇటీవల 10 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మరో 10 మంది టెక్నీషియన్లను కేటాయించారు. డ్రోన్లు ఎగురవేయడమే కాకుండా వాటిని ఎలా తిప్పాలి? ఎక్కడ.. ఎలా వినియోగించాలి? అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. డ్రోన్లు రాగానే ఆయా స్టేషన్లకు అందచేయనున్నారు.

నిఘా మరింత పటిష్ఠం

తిరుపతిని గంజాయి, నేరరహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి డ్రోన్లు ఎంతో ఉపయోగపడతాయి. నేరస్థులపై మరింత నిఘా పెంచతాం. గంజాయి రవాణా, వినియోగం, విక్రయాలకు పాల్పడే వారు పోలీసుల నుంచి తప్పించుకున్నా డ్రోన్ల నిఘా నుంచి తప్పించుకోవడం సాధ్యమయ్యే పనికాదు.

- హర్షవర్ధనరాజు, ఎస్పీ

తిరుపతి, చంద్రగిరిపై డ్రోన్ల నిఘా

● పనితీరుపై ప్రాథమిక పరిశీలన

తిరుపతి, చంద్రగిరి ప్రాంతాల్లో బుధవారం పోలీసులు మూడు డ్రోన్లతో నిఘా పెట్టారు. నిర్మానుష్య, మారుమూల ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేసి ఇవి ప్రాథమికంగా ఎలా పనిచేస్తాయి? ఎలాంటి ఫలితాలు ఇస్తున్నాయనేది పరిశీలించారు. ముఖ్యంగా తిరుపతిలోని అటవీ ప్రాంతం, పోలీసులు వెళ్లలేని శివారు ప్రాంతాల్లో వీటిని ఎగుర వేశారు. చంద్రగిరిలోని శేషాచలం అడవి ఎక్కువగా ఉన్న ఏరియలో డ్రోన్లను పంపారు. కాగా, తిరుపతి ప్రాంతంలో కొందరు మందుబాబులు బహిరంగంగా మద్యం తాగడాన్ని గుర్తించి పట్టుకున్నారు. వారికి ఈగల్ టీమ్ ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించారు. డ్రోన్ల సాయంతో హైవేలపై హాట్ స్పాట్‌లు గుర్తించారు.



శెట్టిపల్లె భూములకు పరిష్కారమేదీ?



తిరుపతి శివారు శెట్టిపల్లె భూసమస్య 30 ఏళ్లుగా పరిష్కారం కాలేదు. గత ఐదేళ్లలో సమస్యను పరిష్కరించకపోగా, 2019వరకు తుడా పరిధిలో ఉన్న ఆ గ్రామాన్ని కార్పొరేషన్‌లో కలిపేశారు. ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. తిరిగి తుడా పరిధిలోకి చేర్చి సమస్యను పరిష్కరించాలి. తిరుపతిలో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలి. 30ఏళ్ల కిందటి అండర్‌డ్రైనేజీ వ్యవస్థ పాడైంది. కొత్తగా ఏర్పాటు చేయాలి.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే

'తుడా'లో అవినీతిపై చర్యలు తీసుకోండి



వైసీపీ ప్రభుత్వంలో 'తుడా'లో జరిగినంత అవినీతిపై దేశంలోనే ఎక్కడా జరిగి ఉండదు. తుడా నిధులు రూ. 246 కోట్లను చంద్రగిరి నియోజకవర్గంలోని ఎంపీడీవోల ఖాతాలకు బదిలీ చేసి, అవినీతికి పాల్పడ్డారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరుతో ఏర్పాటు చేసినా 8 వేల బెంచీలకు తుడా నుంచి ఒక్కోదానికి రూ.7800 చొప్పున చెల్లించారు. వీటినే మండలాల ద్వారా ఒక్కోదానికి రూ.10839 చొప్పున (జీఎస్టీతో కలిపి) 12 వేల బెంచీలు ఏర్పాటు చేశారు. వాస్తవానికి ఈ బెంచీల ధర రూ.2500 నుంచి రూ.2800 మాత్రమే. ఇందులోనే సుమారు రూ.20 కోట్ల అవినీతి జరిగింది. తుడా ఛైర్మన్‌గా ఉన్న సమయంలో రూ.5.16 కోట్ల డీజల్ ఖర్చులు చూపారు. ఇంత సీఎంకు కూడా అయి ఉండదు. ఆయన దగ్గర.. రియల్ ఎస్టేట్‌లో పనిచేయడానికి 65 మందిని నియమించుకుని తుడా ద్వారా ప్రతి నెలా రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు జీతాలు చెల్లించారు. తుమ్మలగుంట చెరువు 88 ఎకరాలుంటే పార్క్‌కు రూ.46 కోట్లు వెచ్చించి, చెరువు పక్కన కబ్జా చేసిన మఠం భూముల విలువ పెంచుకున్నారు. నర్సరీ గార్డెన్‌లో 33 వేల చెట్లు పెట్టారని చూపినా ఆ ఆనవాళ్లేలేవు. తుడాకు కెమెరాలు, డ్రోన్‌లు, కంప్యూటర్ల అవసరం లేకున్నా రూ.40 లక్షలు చెల్లించారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఆరు మండలాల్లో మెడికల్ క్యాంప్‌లకు రూ.10.50 కోట్లు తుడా నిధులు ఖర్చు చేశారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేసుకొన్నా ఇంత కాదు. సమావేశాలకు రూ.50 లక్షలు ఖర్చు చేసారు. ఇలా విచ్చలవిడిగా సాగిన తుడా నిధుల దుర్వినియోగంపై విజిలెన్సు విచారణకు ఫిర్యాదు చేసి, ఐదు నెలలు అవుతున్నా చర్యలు తీసుకోలేదు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలి.

- పులివర్తి నాని, చంద్రగిరి ఎమ్మెల్యే

నామమాత్రంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

● మాజీ మంత్రి రోజా సహా మెజారిటీ ముఖ్యనేతల గైర్హాజరు ● పోరుబాటకూ అదే పరిస్థితి

తిరుపతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గడచిన ఐదేళ్ళూ ఆర్భాటంగా ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహించిన వైసీపీ నేతలు.. అధికారం కోల్పోయాక అతీగతీ లేకుండా పోతున్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లాలో ఆ పార్టీ నాయకులు, శ్రేణుల తీరు దాన్ని ప్రతిబింబించింది. చాలా మండలాల్లో ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించనే లేదు. కొన్ని చోట్ల నామమాత్రంగానే చేశారు. కొన్ని చోట్ల వేడుకల నిర్వహణలోనూ వర్గపోరు కనిపించింది. ఇక జిల్లా కేంద్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పోరుబాటకూ శ్రేణులు కరువయ్యారు. ఐదు నియోజకవర్గాల నుంచీ సమన్వయకర్తలే రాలేదు. అలాంటి వారిలో మాజీ మంత్రి రోజా కూడా వుండడం గమనార్హం. తిరుపతిలో తన నివాసం వద్ద మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నివాసం వద్ద ఆయనతో పాటు మేయర్ డాక్టర్ శిరీష, తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు సమన్వయకర్తలు అభినయ్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి, రాజేశ్ పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని పతాకాలు ఆవిష్కరించారు. కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన పోరు బాట కార్యక్రమంలోనూ భూమన కరుణాకర్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి, నూకతోటి రాజేశ్, మేయర్ శిరీష మాత్రమే పాల్గొన్నారు.

మెజారిటీ ఇన్‌చార్జులు గైర్హాజరు

తిరుపతి ఎంపీ గురుమూర్తి, మాజీ మంత్రి ఆర్‌కే రోజా, మాజీ ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, గూడూరు సమన్వయకర్త ఎమ్మెల్సీ మురళీధర్, వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ తదితర ముఖ్యులు పార్టీ ఆవిర్భావ వేడుకల్లో కనిపించలేదు. మాజీ మంత్రి రోజా శ్రీలంకలో ఉన్నట్లు సమాచారం. ఎంపీ గురుమూర్తి తాడేపల్లిలో జరిగిన కార్యక్రమానికి, గూడూరు నేత మురళీధర్ నెల్లూరులో జరిగిన పోరుబాటకూ హాజరైనట్లు సమాచారం. దీంతో తిరుపతి కలెక్టరేట్ వద్ద జరిగిన పోరుబాటలోనూ, ఆయా నియోజకవర్గాలలో జరిగిన ఆవిర్భావ కార్యక్రమాల్లోనూ నేతలు లేకపోవడం కొట్టొచ్చినట్లు కనిపించింది. బాలాయపల్లి, డక్కిలి, రేణిగుంట, ఏర్పేడు, తొట్టంబేడు, బీఎన్ కండ్రిగ, కేవీబీపురం, చిన్నగొట్టిగల్లు, పాకాల, ఎర్రావారిపాలెం, వడమాలపేట తదితర పదికి పైగా మండలాల్లో పార్టీ ఆవిర్భావ వేడుకలు జరగలేదు. సూళ్ళూరుపేట, నాగలాపురం, పిచ్చాటూరులలో వర్గాలుగా విడిపోయి కార్యక్రమాలు నిర్వహించారు. మిగిలిన మండలాల్లో నామమాత్రంగానే కార్యక్రమాలు జరిగాయి.

రచ్చరచ్చగా యువత పోరు

● గేటు తాళాలు విరిచి కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లిన శ్రేణులు
● మరికొందరి అత్యుత్సాహంతో వాహనదారులకు ఇబ్బందులు





కలెక్టరేట్ వద్ద వైసీపీ శ్రేణులతో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన - బందోబస్తు విధులకు వచ్చి ఫిట్స్‌తో పడిపోయిన వెంకటగిరి కానిస్టేబుల్ మునేంద్రబాబు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 12(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ వద్ద బుధవారం వైసీపీ తలపెట్టిన 'యువత పోరు' నిరసన కార్యక్రమం రచ్చరచ్చగా మారింది. వైసీపీ శ్రేణుల చర్యలతో వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఓపెన్ టాపు జీపు.. ఆ వెనుక వందలాది బైకులతో హారన్లు మోగిస్తూ వైసీపీ శ్రేణులు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఇది స్థానికులను ఇబ్బందులకు గురిచేసింది. ఆందోళనలో కొందరు అత్యుత్సాహం చూపారు. కలెక్టరేట్ ఒకవైపున్న ప్రధానగేటు తాళాలు విరగ్గొట్టి లోపలకు చొచ్చుకొచ్చారు. ఆ సమయంలో పోలీసులూ చెట్లకింద రిలాక్స్‌డ్‌గా ఉన్నారు. అదనపు ఎస్పీ రవి మనోహరాచారి ఆగ్రహం వ్యక్తంచేయడంతో వీరంతా పరుగుతీసి ఆందోళనకారులను బలవంతంగా తీసుకెళ్లి.. ఆ గేటుకు మరో తాళం వేశారు. రోప్‌తో గేటు కట్టారు. ఈ ఘటనతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. బందోబస్తుకు వచ్చిన వెంకటగిరికి చెందిన కానిస్టేబుల్ మునీంద్ర తీవ్ర అస్వస్థతకు గురై ఫిట్స్ వచ్చాయి. సహచరులు అతడిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆందోళన నేపథ్యంలో కలెక్టరేట్ వద్ద భారీ ఎత్తున బారికేడ్లు పెట్టి పోలీసులు మొహరించారు. కలెక్టరేట్ ఉద్యోగులనూ ఐడీ కార్డులు చూసి అనుమతించారు. కాగా, ఆందోళన సందర్భంగా వైసీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు ఇవ్వకుండా యువతను మభ్యపెడుతోందని ఆరోపించారు. అనంతరం భూమనతో పాటు మేయర్ శిరీష, చంద్రగిరి, తిరుపతి, సత్యవేడు వైసీపీ సమన్వయకర్తలు చెవిరెడ్డి మోహిత్, అభినయ్‌రెడ్డి, నూకతోటి రాజేష్ తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనకు ముఖ్యనేతలు, పలువురు నియోజకవర్గ సమన్వయకర్తలు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, పలువురు కార్పొరేటర్లు రాలేదు. కాగా, కొందరు వైసీపీ శ్రేణులు రోడ్డుపైకి చేరుకోవడంతో హైవేలో ఎక్కడ చూసిన వాహనాలు నిలిచిపోయాయి. వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం) : 6.26
సహరి (శుక్రవారం) : 5.02

టీటీడీ సీవీఎస్వోగా ఎస్పీకి అదనపు బాధ్యతలు



తిరుపతి/తిరుపతి(నేరవిభాగం) మార్చి 12(ఆంధ్రజ్యోతి): టీటీడీ సీవీఎస్వోగా జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఆ పోస్టులో చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు కొనసాగారు. జనవరి 8న తిరుపతిలో జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో టీటీడీ సీవీఎస్వో శ్రీధర్‌పై బదిలీ వేటు పడింది. ఆ స్థానంలో చిత్తూరు ఎస్పీ మణికంఠకు ప్రభుత్వం తాత్కాలికంగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది ఆయన చిత్తూరు నుంచీ టీటీడీ నిఘా, భద్రతా వ్యవహారాలను పర్యవేక్షించడం ఇబ్బందిగా మారడంతో తిరుపతి ఎస్పీకి బాధ్యతలు అప్పగించడం సమంజసమని డీజీపీ ప్రభుత్వానికి నివేదించారు. దీంతో తిరుపతి ఎస్పీని టీటీడీ సీవీఎస్వోగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. శ్రీవారి ఆశీస్సులతో తనకు ఈ అవకాశం లభించిందని, టీటీడీ ఉన్నతాధికారులతో కలిసి భక్తులకు ఎలాంటి సేవలు అందించాలో ఆ దిశగా పనిచేస్తానని హర్షవర్ధన్‌రాజు చెప్పారు.

ద్విచక్ర వాహనంపై నుంచి పడి ఏఎస్ఐ గురుస్వామి మృతి



గురుస్వామి (ఫైల్ ఫొటో)

వడమాలపేట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం వెనుక కూర్చుని వడమాలపేట ఏఎస్ఐ వై.గురుస్వామి(60) బుధవారం అప్పలాయగుంట వద్ద వస్తుండగా కిందపడి మృతి చెందారు. బైకు వెనుక ఒకవైపు కూర్చుని వస్తుండగా, ఉన్నట్లుండి కిందపడ్డారు. తలకు తీవ్రగాయమైంది. అక్కడే ఉన్న ఆరోగ్య సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. నిమిషాల వ్యవధిలోనే ఆయన మృతి చెందారు. గుండెపోటు వల్ల పడ్డారా అనే అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. కాగా, గురుస్వామి స్వస్థలం కార్వేటినగరం మండలం ఆర్‌కేవీబీ పేట. ప్రస్తుతం ఏర్పేడులో స్థిరపడ్డారు. రెండున్నరేళ్ల కిందట శ్రీకాళహస్తి నుంచి బదిలీపై వచ్చారు. ఈయనకు ఇద్దరు కుమారులున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాక.. స్వగ్రామానికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధర్మారెడ్డి చెప్పారు.



కనులపండువగా శ్రీనివాసుడి తెప్పోత్సవం

శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు బుధవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి తెప్పపై విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను మాడవీధుల్లో ఊరేగించి శ్రీవారి పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. సుందరంగా అలంకరించిన తెప్పపై రాత్రి 7 నుంచి 8 గంటల వరకు ఉత్సవమూర్తులు ఐదు చుట్లు విహరించి భక్తులను అనుగ్రహించారు. చివరి రోజైన గురువారం శ్రీవారు ఏడుసార్లు తెప్పపై విహరించనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఫ్రీహోల్డ్ భూముల రీసర్వే వేగవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మోహన్

ఎర్రావారిపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో లాండ్స్ ఫ్రీహోల్డ్ రీ సర్వేను వేగవంతం చేయాలని రెవెన్యూ డివిజన్ అధికిరి రామ్మోహన్ మండల రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా సిబ్బందితో సమావేశమయ్యారు. జిల్లాలోనే ఎర్రావారిపాలెం మండలంలో లాండ్స్ ఫ్రీహోల్డ్ జరిగాయన్నరు. తిరిగి ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన త్వరగా చేసి నివేదికలు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులో ప్రజలు ఇచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్ పరమేశ్వరస్వామి, ఆర్ఐలు శ్రీనివాసులు వీఆర్ఓలు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



పాకాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ రఫీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సరస్వతీ పూజ, సమావేశం నిర్వహించారు విద్యార్థులు, ఉపాధ్యాయులు పదవ తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. జూనియర్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎస్ఎంసీ చైర్మన్ పి.మునిప్రభాకర్, నారాయణస్వామి పాల్గొన్నారు.

రామచంద్రాపురం: కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోల్ సమావేశంలో ఎంఈవో మార్కొండేయలునాయుడు, ఎంఈవో-2జయవేలు, ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ చిట్టిబాబు, దేవరాజులునాయుడు పాల్గొన్నారు.

జ్ఞాన సముపార్జనతోనే జీవితంలో రాణింపు


మాట్లాడుతున్న బాల సుబ్రమణ్యం

ఎర్రావారిపాలె, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వ్యక్తి జీవితంలో విజేతగా నివాలంటే జ్ఞాన సంపార్జనతోనే సాధ్యపడుతుందని ఎంఈవో-1 బాలసుబ్రమణ్యం అన్నారు. బుధవారం జరిగిన నెరబైలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో ఇష్టంగా చదవాలని సూచించారు. నేటి ఆధునిక డిజిటల్ యుగంలో ఎదిగేందుకు విస్తృత అవకాశాలున్నాయన్నారు. సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, మండల టీడీపీ అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, వీరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యావిధానానికి అనుగుణంగా బోధన

ఎర్రావారిపాలెం, మార్చి 12(ఆంధ్రజ్యోతి); సమాజ మార్పులకు అనుగుణంగా ప్రభుత్వాలు విద్యా విధా ఎమ్మిఓ-2 సతీష్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో జరిగిన క్లస్టర్ ఉపాధ్యాయుల శిక్షణా సమావేశాలో పాల్గొన్నారు. జాతీయ విద్యావిధానం-2020కి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధన తీరును మెరుగు పరుచుకోవాలన్నారు. మండలంలో మూడు సీఆర్సీ కేంద్రాల్లో ఈ సమావేశాలు జరిగాయి. గణితం,ఆంగ్లంతో పాటు మాతృభాష నైపుణ్యాన్ని వివరించాల్సి బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. త్వరలో విద్యావిధానం తీరు సమూలంగా మారనుందన్నారు. సమావేశాల్లో ప్రధానోపాధ్యాయులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం


పార్టీ జెండాను ఆవిష్కరించిన మోహిత్‌రెడ్డి

చంద్రగిరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వైసీపీ కార్యాలయం వద్ద బుధవారం ఆపార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పార్టీ జెండా ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోరాటాలతో పుట్టిన పార్టీ వైసీపీ అని అన్నారు. నియోజకవర్గంలో వైసీపీ పూర్వ వైభవం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, వైసీపీ నాయకులు యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, మాధవరెడ్డి, పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి రూరల్: మండలంలోని పలు పంచాయతీల్లో బుధవారం వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. సి.మల్లవరం లో సర్పంచ్ మొక్కల భారతి, గాంధీపురం పంచాయతీలో సర్పంచ్ ఎం.లక్ష్మీ 15కేజీల కేక్‌లను కట్ చేశారు. కార్యకర్తలు, అభిమానులకు స్వీట్లు పంచిపెట్టారు. నేతలు కొత్తపాటి మునీశ్వరరెడ్డి, మొక్కల తిమ్మారెడ్డి, మున్నూరు శివకుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి స్థల పరిశీలన


పోలీస్ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్కే మీనా

తిరుమల, మార్చి12(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గరుడ-2 పోలీస్ గెస్ట్‌హౌస్ నిర్మాణం కోసం పోలీస్ రిక్రూట్మెంట్, హౌసింగ్ బోర్డు చైర్మన్ ఆర్కే మీనా స్థల పరిశీలన చేశారు. ఎస్పీ హర్షవర్థన్‌రాజుతో కలిసి తిరుమలలోని పోలీస్ క్వార్టర్స్ వద్దనున్న ఖాళీ స్థలాన్ని ఆయన బుధవారం సాయంత్రంచూశారు. ఇందుకు సంబంధించి వివిధ కోణాల్లో స్థానిక పోలీసుల అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన కుటుంబ సమేతంగా తెప్పోత్సవాల్లో పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య



రామచంద్రాపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి):రాయలచెరువు కట్టపై గుర్తు తెలియని ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా.. రాయలచెరువు కట్టపై చేపలమార్కెట్‌కు ఎదురుగా ఉన్న పొదల మాటున ఓ మృతదేహం నుంచి దుర్వాసన వస్తోందని బుధవారం ఉదయం స్థానికులు గుర్తించారు. వారు వెంటనే పోలీసులకు తెలియజేశారు. ఎస్ఐ రామాంజనేయులు సిబ్బందితో చేరుకుని పరిశీలించారు. సుమారు 50ఏళ్ల వయసున్న మహిళ చెట్టుకు ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. మృతురాలు ఆకుపచ్చ చీర, ఎర్ర రంగు రవిక ధరించి ఉంది. మృతదేహం పక్కన ఎర్రగళ్ల టవలు కూడా ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు తరలించారు. మృతదేహనికి సంబంధించి ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 9440797731 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

ఆలయంలో హుండీ చోరీ



రామచంద్రాపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బ్రహ్మణకాల్వ అంకమ్మ, పోలమ్మ ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయ దాత నాగభూషణం నాయుడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. వివరాలిలా.. నెల రోజుల క్రితం అంకమ్మ, పోలమ్మ ఆలయాన్ని నిర్మించి 41రోజులు మండలాభిషేకం నిర్వహించారు. మంగళవారం పూజలు నిర్వహించి ఆలయానికి తాళం వేశారు. బుధవారం ఉదయం ఆలయ తలుపులు తెరచి, హుండీ పగులుగొట్టి ఉండటాన్ని గ్రామస్తులు గమనించారు. హుండీలో రూ.1.50లక్షలు నగదు, 8గ్రాముల తాళిబొట్లు, రెండు దీపపు స్తంభాలు, 500 గ్రాములు వెండి పళ్లెం, 4 రాగిచెంబులు గుర్తు తెలియని దొంగలు తీసుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మధ్యాహ్నం ఆలయానికి క్లూస్ టీం చేరుకుని వేలిముద్రలు సేకరించింది. ఎస్ఐ రామాంజనేయులు కేసు నమోదు చేశారు.

పోగొట్టుకున్న ఉంగరం భక్తుడికి అప్పగింత


భక్తుడికి ఉంగరాన్ని అందజేస్తున్న ఏవీఎస్వో

తిరుమల, మార్చి12(ఆంధ్రజ్యోతి): భక్తుడు పోగొట్టుకున్న బంగారు ఉంగరాన్ని కల్యాణకట్ట ఉద్యోగులు తిరిగి అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు తలనీలాలు సమర్పించేందుకు బుధవారం ఉదయం హెచ్‌వీసీ కల్యాణకట్టకు వచ్చాడు. తలనీలాలు సమర్పించాక తలను శుభ్రపరుచుకునే క్రమంలో రూ.50 వేల విలువైన బంగారు ఉంగరాన్ని జారవిడుచుకున్నాడు. కల్యాణకట్ట ఉద్యోగులు పవన్, పురుషోత్తం గుర్తించి ఏవీఎస్వో శైలేంద్ర ద్వారా ఆ ఉంగరాన్ని తిరిగి భక్తుడికి అందజేశారు.

ఆక్రమణపై అధికారుల ఆదేశాలూ బేఖాతర్


గంగుడుపల్లెలో దర్జాగా రేకుల షెడ్డు నిర్మాణం


చంద్రగిరిలో ఆక్రమణకు గురైన కాలువ స్థలం

చంద్రగిరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆర్డీవో రామ్మోహన్ ఆదేశాలనూ కింది స్థాయి రెవెన్యూ అధికారులు బేఖాతరు చేస్తున్నారు. గంగుడుపల్లెలో మహిళా భవనానికి కేటాయించిన ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతుందని గ్రామ సర్పంచ్ కుమారుడు క్రాంతి కుమార్ జనవరి 29న తహసీల్దార్ శివరామసుబ్బయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. సర్వే నెంబర్ 334-4లోని 0.7 సెంట్ల ప్రభుత్వ భూమిని కూడా అదేగ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమణలో భాగంగా పందిర వేశాడని ఫిర్యాదు చేశారు. గతంలో ఇదే స్థలం కబ్జాకు గురైయితే అప్పటి రెవెన్యూ అధికారులు తొలగించి పంచాయతీకి అప్పగించారు. రెండు నెలల క్రితం మళ్లీ ఆక్రమించారు. ఇటీవల ఆర్డీవో రామ్మోహన్ రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గంగుడుపల్లెలో ఆక్రమణ విషయం తన దృష్టికి రావడంతో ఆర్డీవో స్పందించారు. ఆక్రమణలను ఎందుకు తొలగించలేదని మండిపడ్డారు. అయినా ఇంతవరకు ఆక్రమణలను తొలగించలేదు.

●చంద్రగిరిలో సినిమా థియేటర్ సమీపంలోని కాలువ పొరంబోకు స్థలంలో ఓ వ్యక్తి ప్రహరీ గోడ నిర్మించి ఆక్రమించుకున్నాడు. పాతపేట బాలాజీకాలనీకి ఆనుకుని సర్వే నెంబర/ 171లో కాలవ పోరంబోకు ఉంది. గతంలో ఆక్రమణకు గురైయిందని మీడియాలో రావడంతో రెవెన్యూ అధికారులు వెళ్లి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా లెక్క చేయకుండా ఆక్రమణలకు పాల్పడుతున్నారు.

నగరంలో పైప్‌లైన్ ఏర్పాటుకు టీటీడీ నిధులు

●రూ.9కోట్ల విడుదలకు ప్రభుత్వం అనుమతి

తిరుపతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు కోసం మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ. 9 కోట్ల టీటీడీ నిధులు విడుదల కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం టీటీడీకి అనుమతి జారీచేసింది. కార్పొరేషన్ పరిధిలో తాగునీటి అవసరాల కోసం ఎండీ పుత్తూరు పంపింగ్ స్టేషన్ నుంచీ మంగళం పంపింగ్ స్టేషన్ మధ్య తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు రూ. 40 కోట్లు అవసరమని 2023లో మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం టీటీడీని అభ్యర్థించింది. అదేఏడాడి సెప్టెంబరు 5న అప్పటి టీటీడీ పాలకమండలి రూ. 40 కోట్లు ఇచ్చేందుకు అంగీకరిస్తూ తీర్మానం చేసింది. దానికనుగుణంగా టీటీడీ నుంచీ నిధుల విడుదలకు ప్రభుత్వం అదే నెల 25న అనుమతి ఇచ్చింది. అయితే ఈ పనుల సందర్భంగా గురవరాజుపల్లి సచివాలయం నుంచీ ఎయిర్‌పోర్టు రోడ్డు వరకూ 1235 రన్నింగ్ మీటర్ల మేరకు ఇపుడున్న ప్రి స్ట్రెస్డ్ కాంక్రీట్ పైపులను మార్చి కొత్తవి ఏర్పాటు చేయడానికి అదనంగా రూ. 9 కోట్లు కావాలని మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం అభ్యర్థించింది. నిధులిచ్చేందుకు గతేడాది డిసెంబరు 24న టీటీడీ బోర్డు తీర్మానించింది. నిధుల విడుదలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఈ ఏడాది జనవరి 7న టీటీడీ ఈవో ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇందుకు అనుమతి ఇస్తూ బుధవారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది.

ఓటేరు చెరువు పరిరక్షణకు పోరాటం

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ


సీపీఎం, సీపీఐనేతలతో కలసి చెరువును పరిశీలిస్తున్న నారాయణ, చించివేసిన హెచ్చరికబోర్డును చూపుతున్న నారాయణ తదితరులు

తిరుపతి రూరల్, మార్చి12(ఆంధ్రజ్యోతి): ఓటేరుచెరువును ఆక్రమించేందుకు ఒడిగట్టడం దుర్మార్గమైన చర్యఅని సీపీఐ జాతీయకార్యదర్శి నారాయణ ఖండించారు. చెరువులో పూడ్చిన మట్టిని తొలగించేవరకు పోరాటాలు చేస్తామన్నారు. ఓటేరు చెరువును వామపక్షపార్టీలు, ఆర్‌పీఐ నేతలతో కలసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. చెరువులు, కుంటలు, ప్రభుత్వభూములు కబ్జాకు పాల్పడడం దుర్మార్గమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఓపక్క ఇంకుడుగుంతలకు ప్రాధాన్యత ఇస్తామంటుండగా, చెరువు కబ్జాచేసి పూడ్చేస్తుంటే చూస్తూ ఉండడం అన్యాయమన్నారు. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. పరిసరప్రాంతాల ప్రజలను చైతన్య పరచి ఆక్రమణదారుల నుంచి చెరువుకి విముక్తి కలిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇందుకోసం జైలుకెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎ.రామానాయుడు, నేతలు పి.మురళి, చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, విశ్వనాథ్, నదియా, రవి, హేమలత, జయచంద్ర, వేణు, బుజ్జమ్మ, ఆర్పీఐ నేతలు పి.అంజయ్య, గొడుగుచింత గోవిందయ్య, పద్మనాభరెడ్డి, ఏఐఎస్ఎఫ్‌నేత కె.శివారెడ్డి, ప్రజాసంఘాలనేతలు పాల్గొన్నారు.


రణధీరపురంలోని 7వ లైనులో కొత్తగా వేసిన బోరు, 10వ లైనులో అమర్చిన ప్రజా మరుగుదొడ్లు - కొళ్లఫారం వీధిలో పైపుల లీకేజీలకు మరమ్మతులు

తాగునీటి సమస్యకు.. ముందస్తు చెక్

మంగళంలో ముమ్మరంగా చర్యలు

తిరుపతి అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వేసవి సమీపిస్తున్న దృష్ట్యా నగర శివారు ప్రాంతాలైన సప్తగిరికాలనీ, రణధీరపురం, మంగళం 2, తిరుమలనగర్, శెట్టిపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో నీటి ఎద్దడి ఎదురుకాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పాడైన పైపులు, గేట్‌వాల్వ్‌లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేస్తున్నారు. నీటి ట్యాంకులను శుభ్రపరుస్తున్నారు. బోర్లు రిపేర్లు చేయడమేగాక అవసరమైన చోట కొత్తవి వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మంగళం 2లో రూ.5లక్షలతో సంపు ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. అవసరమైన ప్రదేశాలలో పబ్లిక్ ట్యాప్‌లను అమరుస్తున్నారు. నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతానికి నీటి సమస్య రాలేదని, వేసవిలోనూ రాకుండా చూస్తామని సచివాలయ కార్యదర్శులు మురళి, నాగరాజు, స్వాతి, లావణ్య, జయశంకర్‌లు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కొత్త ప్రతిపాదనలు

- సప్తగిరికాలనీ సచివాలయ పరిధిలో భవిష్యత్తు అవసరాల కోసం కొత్తగా రెండు బోర్లు వేయడానికి ప్రతిపాదించారు.
- శెట్టిపల్లి సచివాలయ పరిధిలో 4 బోర్లు, ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు.

రోడ్డు ప్రమాదంలో కలప వ్యాపారికి తీవ్రగాయాలు



శ్రీకాళహస్తి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కలప వ్యాపారి తీవ్రంగా గాయపడ్డాడు. తొట్టంబేడు మండలం కొమ్మనగుంటకు చెందిన గురవయ్య కలప వ్యాపారం చేస్తుంటాడు. ఇటీవల మహా శివరాత్రి సందర్భంగా దీక్షను స్వీకరించాడు. బుధవారం ఉదయం సింగమాలలోని శివాలయాన్ని దర్శించుకునేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. చిన్నసింగమాల వద్ద పీఎన్ రహదారి అండర్ పాస్ వంతెన కింద వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మినీ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో గురవయ్య కాలు విరిగింది. స్థానికులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉలిక్కిపడ్డ చిత్తూరు

●తుపాకులతో బెదిరించి దోపిడీయత్నం ●డమ్మీవని తెలిసి తప్పించుకున్న వ్యాపారి
●అప్రమత్తమై దొంగల్ని పట్టుకున్న స్థానికులు ●నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు పారిపోగా.. ●ఒకరు ములకలచెరువులో అరెస్టు


సంఘటనా స్థలంలో ఆక్టోపస్ బృందం


పుష్పా స్టోర్ యజమాని భవనం వద్ద గుమికూడిన స్థానికులు

చిత్తూరు అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరం ఉలిక్కిపడింది.బుధవారం ఉదయం గాంధీ రోడ్డులో దోపిడీదొంగలు బీభత్సం సృష్టించారని తెలిసి ఆందోళనకు గురైంది.స్థానికుల చొరవతో వారు పట్టుబడ్డారని తెలిసి ఊపిరి పీల్చుకుంది.వివరాల్లోకి వెళితే..
చిత్తూరులోని గాంధీరోడ్డులో చంద్రశేఖర్ అనే వ్యక్తి పుష్ప కిడ్స్ వరల్డ్ షాపును నిర్వహిస్తున్నాడు. గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్స్‌లో షాపును నిర్వహిస్తుండగా.. సెకండ్ ఫ్లోర్‌లో నివాసం ఉంటున్నాడు.ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కూడా ఆయన రాణిస్తున్నాడు. మరోవైపు చిత్తూరు కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఎస్ఎల్‌వీ ఫర్నిచర్స్ యజమాని సుబ్రమణ్యం వ్యాపారంలో కుదేలైపోయాడు. మోసాలకు అలవాటు పడ్డ సుబ్రమణ్యం దోపిడీకి ప్రణాళిక రచించాడు. ఆర్థికంగా మంచి స్థాయిలో ఉన్నాడని భావించి పుష్ప కిడ్స్ వరల్డ్ యజమానిని దోచుకునేందుకు తనకు పరిచయమున్న వ్యక్తుల్ని అనంతపురం, నంద్యాల నుంచి మంగళవారం చిత్తూరుకు పిలిపించాడు. మూడు డమ్మీ తుపాకులు, 15 డమ్మీ బుల్లెట్లతో పాటు దోపిడీకి అవసరమైన గ్లౌజులు, మాస్కులు, కారం పొడి, నాలుగైదు కత్తులు కొనుగోలు చేశారు.చంద్రశేఖర్ ఇంట్లోకి ఎవరు ముందుగా వెళ్లాలి.. ఎవరు తుపాకులు పట్టుకోవాలి.. ఎవరు ఎలా బెదిరించాలి.. వంటివాటిపై చర్చించుకున్నారు.బుధవారం ఉదయం 6.20 గంటలకు ఓమ్నీ వ్యానులో సుబ్రమణ్యం మరో ఆరుగురితో కలిసి దుకాణం వద్దకు చేరుకున్నాడు.వారంతా నేరుగా చంద్రశేఖర్ నివాసం ఉంటున్న రెండో ఫ్లోర్‌లోకి వెళ్లారు.తుపాకులతో బెదిరించి డబ్బు, నగలు ఇవ్వాలన్నారు.ఇంతలో ఒకరు తుపాకీని కాల్చగా.. శబ్దాన్ని బట్టి అది డమ్మీ తుపాకీ అని గ్రహించిన చంద్రశేఖర్ వెంటనే మరో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని బిగ్గరగా కేకలు పెట్టడంతో బయట ఉన్న స్థానికులు అప్రమత్తమయ్యారు. ఆ ఏడుగురు లోపలికి వెళ్లే సమయంలోనే పక్కనే ఉన్న టీ షాపులోని ఉమాపతి సహా మరికొందరు వారిని అనుమానించారు. చంద్రశేఖర్ కేకలతో అప్రమత్తమై పోలీసులకు సమాచారమిచ్చారు. 15-20 నిమిషాల వ్యవధిలోనే సుమారు 50-60 మంది స్థానికులు గుమికూడి దొంగలు పారిపోకుండా బిల్డింగ్‌ను చుట్టుముట్టారు. దొరికిపోయామని గ్రహించిన దొంగలు వెళ్లిన దారిలోనే వెనక్కి వస్తే జనాలు పట్టుకుంటారని భావించి పక్కనే ఉన్న పాత భవనంపైకి దూకేశారు. 15 అడుగుల ఎత్తు కావడంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి.ఈలోపే బిల్డింగ్‌ను చుట్టుముట్టిన స్థానికులు దొంగలకు పారిపోయే అవకాశాన్నివ్వలేదు. పోలీసులు వచ్చేలోగా దొంగలు తప్పించుకోకుండా కాపుకాశారు. తరువాత కూడా దొంగల్ని పట్టుకోవడంలో పోలీసులకు సాయం చేశారు.నలుగురు దొంగల్ని పోలీసులు అదుపులోకి తీసుకోగా.. ముగ్గురు పారిపోయారు. వారిలో ఒకర్ని ములకలచెరువు సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురు నిందితుల్ని టూటౌన్ పోలీసులు విచారిస్తుండగా.. సీఐ నెట్టికంఠయ్య కేసు నమోదు చేశారు.మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. మూడు తుపాకులు, 15 బుల్లెట్లు, నాలుగైదు చాకులు, గ్లౌజులు, మాస్కులు, కారం పొడి, ఓమ్నీ వ్యానులను సీజ్ చేశారు. కీలక నిందితుడు సుబ్రమణ్యం సహా వ్యాను నడిపిన సంపత్, నవీన్, రాజశేఖర్, ఇబ్రహీమ్‌లను విచారిస్తున్నారు. పారిపోయిన మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది.

●ప్రధాన నిందితుడు సుబ్రమణ్యానిది నంద్యాల

నంద్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరులో పట్టుబడ్డ దొంగలముఠాలో కీలక నేరస్తుడు సుబ్రమణ్యం అలియాస్ మాణ్యాలు నంద్యాలకు చెందిన వాడు. ఇతనితోపాటు నంద్యాలకు చెందిన నవీన్ అనే మరో దొంగ కూడా పోలీసులకు పట్టుబడ్డాడు.సుబ్రమణ్యం తొలుత ఓ రాజకీయ నాయకుడికి ప్రధాన అనుచరుడిగా ఉంటూ చివరకు అతడినే 2005లో హత్య చేయించాడు.అప్పటి నుంచి సుబ్రమణ్యం అంటే జనంలో భయం ఏర్పడడంతో దాన్నే ఆసరాగా చేసుకొని వ్యాపారాల్లో దిగాడు. ఓ ఫర్నిచర్ దుకాణం నడిపాడు.రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశాడు. చివరకు రూ. కోట్లలో ఐపీ పెట్టి 2013 తర్వాత చిత్తూరుకు మకాం మార్చాడు.రూ.కోట్లలో అప్పులు చేసి తీర్చలేక దోపిడీకి యత్నించి దొరికిపోయాడు.

● పెద్దఎత్తున మోహరించిన పోలీసులు

ఉదయం 7 గంటల నుంచి 8 గంటల మధ్యలో ఆపరేషన్ పూర్తయింది. నలుగుర్ని అదుపులోకి తీసుకున్న తరువాత ఇంకా ముగ్గురు లోపలే ఉన్నారనే అనుమానంతో తిరుపతి ఆక్టోపస్ యూనిట్ చిత్తూరుకు చేరుకుని రంగంలోకి దిగింది. 23 మంది సిబ్బంది భారీ ఆయుధాలతో పుష్ప స్టోర్ సహా చుట్టుపక్కల ప్రాంతాలను తనిఖీ చేశారు.


దుండగులను చితకబాదుతున్న స్థానికులు


సుబ్రహ్మణ్యాన్ని కట్టేసిన స్థానికులు


ఇంటి పైకప్పుపై దుండగుల కత్తి

తిరుపతి

‘దిల్‌రూబ’ అన్ని వర్గాలను అలరిస్తుంది

నటుడు కిరణ్ అబ్బవరం



మీడియాతో మాట్లాడుతున్న సినీనటుడు కిరణ్ అబ్బవరం, చిత్ర బృందం

తిరుపతి అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తాను కథానాయకుడిగా నటించిన దిల్‌రూబ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని యువ హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. ఈ చిత్రం హోలీ(14న) రోజున విడుదలవుతుండడం సంతోషంగా ఉందన్నారు. బుధవారం సాయంత్రం చిత్రబృందంతో కలిసి ఆయన ఓ హోటల్లో మీడియాతో మాట్లాడారు. ఇది తన పదవ సినిమా అని, ఇందులో తన పాత్ర సరికొత్తగా ఉంటుందని అన్నారు. కొత్తవారికి సినిమాల్లో అవకాశం రావడం లేదని, ముఖ్యంగా రాయలసీమ నుంచి వచ్చేవారికి చాలా తక్కువని ఆవేదన వ్యక్తం చేశారు. కిందిస్థాయి నుంచి వచ్చిన తాను సమాజ సేవకు కృషి చేస్తానన్నారు. హీరోయిన్ రుక్సాదిల్లాన్ మాట్లాడుతూ కృష్ణార్జునుల యుద్ధం తర్వాత ఈ సినిమాలో అవకాశం లభించిందని తెలిపారు. మరో నటి నజియా మాట్లాడుతూ తొలిసారిగా నటించిన ఈ సినిమాలో తన పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంటుందన్నారు.

పెండింగ్ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఊతం

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 12(ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం అందిస్తోందని కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎంఏవై పథకం కింద మంజూరు చేసి అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేయడానికి ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అందిస్తారని పేర్కొన్నారు. ఇది గత ఏడాది డిసెంబరు 10వ తేదీ నాటికి నిర్మాణంలో ఉన్న ఇళ్లకు మాత్రమే వర్తిస్తుందని పేర్కొన్నారు. ఏప్రిల్ నాటికి పూర్తి చేసుకున్న వారికి మాత్రమే ఈ అదనపు లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు.

సమర్థవంతంగా టెన్త్ పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం రాత్రి అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పలు అంశాలపై జిల్లా అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ఎలాంటి లోటుపాట్లూ లేకుండా ప్రశాంత వాతావరణంలో జరగాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. మాస్ కాపీయింగ్ లేకుండా చూడాలన్నారు. మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు.

వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన లక్ష్మీ అమృత

తిరుపతి(నేరవిభాగం), మార్చి 12(ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం కొర్లగుంట మారుతీనగర్‌లో చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ గిరిబాబు వివరాల మేరకు.. తిరుపతికి చెందిన వెంకటలోకేష్ తిరుపతిలోని బిగ్ బాస్కెట్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. తెనాలి సమీపంలోని చెరుకుపల్లికి చెందిన లక్ష్మీ అమృతను ఆరేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మధ్యాహ్నం విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన వెంకటలోకేష్ భోజనం చేసి, పిల్లలతో మాట్లాడుతుండగా బెడ్ రూములోకి వెళ్లిన లక్ష్మీఅమృత (27) ఉరేసుకుంది. ఎంతకీ బెడ్ రూములో నుంచి రాకపోవడంతో తలుపు తట్టాడు. స్పందన లేకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ఉరేసుకుని ఉండడంతో వెంటనే ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ గిరిబాబు ఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. భార్యాభర్తలు తరచూ గొడవలు పడేవారని చుట్టుపక్కల వారు చెప్పినట్లు తెలిసింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలో కరెంట్ తీగల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖర రావు తెలిపారు. మెడికల్ కళాశాల, ప్రభుత్వ ప్రసూతి, స్విమ్స్, బర్డ్, రుయా ఆస్పత్రులు, డాక్టర్ల వసతి గృహాలు, చెన్నారెడ్డి కాలనీ, అంబేడ్కర్ కాలనీ, మంచాలవీధి, త్యాగరాజనగర్, సింగాలగుంట, వరదరాజనగర్, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 12(ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని తిరువణ్ణామలైకి గురు, శుక్రవారాల్లో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయాత్పూర్వం నుంచి 140 బస్సులు ప్రతి పది నిమిషాలకూ ఒకటి చొప్పున బయలుదేరుతాయని పేర్కొన్నారు. సాధారణ చార్జీలే వసూలు చేస్తారని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మా భూమి మాకు ఇప్పించండి

తిరుపతి(ఆటోనగర్), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : తమకు భూమి విక్రయించినట్లు నాటకమాడి మోసం చేసిన వారిని శిక్షించాలని వేదాంతపురానికి చెందిన చిన్నసుబ్బయ్య, మహబుబ్ బాషా కోరారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామ లెక్కదాఖలాలోని సర్వే నెంబరు 245-3బిలోని 27.5 అంకణాలు, 37.5 అంకణాలు కలిగిన ప్లాట్లను కాలూరు క్రాస్‌కు చెందిన విమలమ్మ, ఆమె కుమారుడు నరేంద్రరెడ్డి నుంచి 2021లో తాము కొనుగోలు చేసి, రిజిస్టర్ చేయించుకున్నామన్నారు. అయితే అంతకుముందే ఆ స్థలం నేషనల్ హైవేకు వెళ్లిన విషయాన్ని వారు దాచిపెట్టి, పరిహారాన్ని సైతం ప్రభుత్వం నుంచి తీసుకున్నారని చెప్పారు. కొందరు దళారులతో కలిసి తమ వద్ద లక్షలాది రూపాయలు తీసుకుని మోసం చేశారని ఆరోపించారు. దీనిపై గత ఏడాది డిసెంబరులో తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ఇప్పటివరకు పట్టించుకోలేదని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి, న్యాయం చేయాలని కోరారు.

జనసేన ఆవిర్భావ సభకు శ్రేణులు సన్నద్ధం

తిరుపతి అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో శుక్రవారం జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు తిరుపతి నియోజకవర్గం నుంచి భారీగా తరలివెళ్లేందుకు జన సైనికులు సిద్ధమవుతున్నారు. ఆ పార్టీ నగరాధ్యక్షుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500మంది హాజరయ్యేలా సమాయత్తం చేస్తున్నారు.ఇప్పటికే కొంతమంది వెళ్లగా మిగిలిన వారు గురువారం ఉదయం అలిపిరి గరుడావలయం వద్ద 501 కొబ్బరికాయలు కొట్టి బయలుదేరనున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 32 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మార్చి 12(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 32 మందికి జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగవ అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన 32 మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచగా విచారించిన న్యాయమూర్తి రూ.10వేలు చొప్పున రూ.3.20 లక్షల జరిమానా విధించారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన తిరుపతి రూరల్ అంబేడ్కర్ కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. అంబేడ్కర్ కాలనీకి చెందిన బోడిరెడ్డి అనంతమ్మ ఇంటి ముందు వాకింగ్ చేస్తుండగా ఇద్దరు యువకులు బైక్‌లో వచ్చి ఆమె మెడలో ఉన్న 40 గ్రాముల బంగారు గొలుసు లాక్కొని ఉడాయించారు. స్థానికులు గుర్తించి పట్టుకునే ప్రయత్నం చేసినా దొరకలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఈసారైనా ‘ఈట్ స్ట్రీట్స్’ వచ్చేనా?

తిరుపతిలో మళ్లీ తెరపైకి ఫుడ్‌కోర్టు ● పలు మాస్టర్ ప్లాన్ రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేషన్ అధికారులు



ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఈట్ స్ట్రీట్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు (ఫైల్ ఫొటో)

తిరుపతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ఈట్ స్ట్రీట్ ప్రాజెక్టు మళ్లీ తెరపైకి వచ్చింది. ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు ఆర్టీసీ బస్టాండు ఎదురుగా గల మాస్టర్ ప్లాన్ రోడ్డు (సామవాయి మార్గం)తో పాటు చింతలచేను వద్దగల వంద అడుగుల రోడ్డు (కులశేఖర్ ఆళ్వార్ మార్గం)లను పరిశీలిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వెస్ట్ రైల్వేస్టేషన్ వద్ద కొత్తగా ఏర్పాటు చేయనున్న 60 అడుగుల రోడ్డు ప్రాంతంలో ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేయాలని కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. అయితే అది రైల్వే స్థలం కావడంతో సంబంధిత ఫైలును మేయర్ డాక్టర్ శిరీష పక్కన పెట్టినట్టు తెలిసింది. వాస్తవానికి 2018లో టీడీపీ హయాంలో అప్పటి కమిషనర్ విజయరామరాజు స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద తిరుపతిలో పలుచోట్ల ఈట్ స్ట్రీట్స్ ఏర్పాటు చేయాలని భావించారు. ఆ తర్వాత 2019 సెప్టెంబరులో ‘ఈట్ స్ట్రీట్‌ను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నామని అప్పటి కమిషనర్ గిరీష వెల్లడించారు. అన్ని రకాల ఆహారపదార్థాల తయారీ మొబైల్ ఫుడ్ వాహనాల ద్వారా ఇక్కడ జరుగుతుందని మీడియాకు వివరించారు. యాత్రికులు ఎక్కువగా ఉండే ప్రాంతాలు కాకుండా తిరుపతి ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా దీన్ని తీసుకొస్తున్నామని చెప్పారు. అయితే ఇవన్నీ మాటలకే పరిమితమయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ క్రమంలో నగరంలో పలుచోట్ల ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయాలని భావించారు. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ నిధులతో ఈట్ స్ట్రీట్‌లు ఏర్పాటు చేసేందుకు కసరత్తు జరుగుతోంది. ఇతర నగరాల్లో ఉన్న మోడల్ ఈట్ స్ట్రీట్స్‌ను సందర్శించి, అధ్యయనం చేసిన తర్వాత ఏర్పాటుచేస్తే కార్పొరేషన్‌కు మంచిపేరుతోపాటు రెవెన్యూ కూడా వస్తుందని అభిప్రాయపడ్డారు. మరోసారి తెరపైకి వచ్చిన ఈ ప్రాజెక్టు పట్టాలెక్కుతుందో లేదో చూడాలి.

‘టీడీపీతోనే మహిళా సాధికారత’



మీడియాతో మాట్లాడుతున్న సుగుణమ్మ తదితరులు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మహిళలకు ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. 2025-26 బడ్జెట్‌లో మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పించిందన్నారు. స్కీమ్ వర్కర్లకు గ్రాట్యుటీ, ఇతర సమస్యలు పరిష్కరించంలో సీఎం చొరవ అభినందనీయమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలు పారిశ్రామికవేత్తలుగా రాణించడానికి రుణాల రాయితీ 35 నుంచి 45 శాతానికి పెంచినట్లు వెల్లడించారు. రాష్ట్రాభివృద్ధిలో మహిళలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తెలుగు మహిళలు బ్యాంక్ శాంతమ్మ, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిల్చుని నిరసన

కొనసాగిన వెటర్నరీ విద్యార్థుల సమ్మె



తిరుపతి రూరల్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారమూ కొనసాగింది. వర్సిటీ ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వంలో చర్చల కోసం తమను తీసుకుని వెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరుతూ బుధవారం వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట మోకాళ్లపై నిల్చుని అభ్యర్థించారు. తమకు మాటిచ్చి వారం రోజులు గడిచినా అధికారులు మిన్నకుండిపోవడం సరికాదని, సత్వరమే తగు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత, సీవోఈ ప్రొఫెసర్ చెంగల్వరాయులు విద్యార్థుల వద్దకు వచ్చి మాట్లాడారు. ఇప్పటికే పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ప్రభుత్వం సానుకూలంగా ఉందని వివరించారు. సమ్మెను విరమించి తరగతులకు హాజరుకావాలని కోరారు. కాగా పశుసంవర్ధక శాఖా మంత్రిని కలసి వివరిస్తామని చెప్పారని విద్యార్థులు పేర్కొన్నారు.

యువత పోరు కాదు.. వృద్ధుల పోరు..!

శాప్ ఛైర్మన్ రవినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ చేపట్టిన ఫీజు పోరు వృద్ధుల పోరుగా ఉందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఎద్దేవా చేశారు. యువత నుంచి వైసీపీ ఆందోళనకు స్పందన కరువైందన్నారు. ఇందువల్ల వృద్ధులతో పోరు చేయాల్సి వచ్చిందని అభిప్రాయపడ్డారు. వైసీపీ పాలనలో కోట్లాది రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్ బకాయిలు పెట్టారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వాటిని విడుదల చేస్తోందన్నారు. అయినా యువతను మభ్యపెట్టడానికి ఫీజుపోరు చేపట్టడం సిగ్గు చేటన్నారు. యువత ఉద్యోగాల కోసం చదువుకుంటున్నారని తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల దాడి

మూడు వాహనాల స్వాధీనం



పోలీసులు సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి రూరల్ మండలంలోని స్వర్ణముఖి నది పరిసర ప్రాంతాల్లో బుధవారం రాత్రి పోలీసులు దాడులు చేశారు. ఇసుక అక్రమ రవాణాకు ఉపయోగించిన ఎక్స్‌వేటర్, టిప్పర్, ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేసినా సీజ్ చేస్తామని, వాహనాల యజమానులపై కేసులు నమోదు చేస్తామని సీఐ చిన్నగోవిందు హెచ్చరించారు.

తిరుచానూరు నుంచి ఆ వసూల్‌రాజా బదిలీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుచానూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలో అవినీతికి పాల్పడిన ఉద్యోగిని అధికారులు బదిలీ చేశారు. ఎక్కువ రాబడి కలిగిన మేజర్ పంచాయతీల్లో తిరుచానూరు ఒకటి. కొంతకాలం క్రితం డివిజనల్ పంచాయతీ అధికారి పేరు చెప్పుకొని ఓ కాంట్రాక్టు ఉద్యోగి ఇంటి పన్నులు, పన్ను పేరు మార్పిడితో భారీగా అవినీతికి పాల్పడ్డాడు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి స్పందించి దీనిపై విచారణకు ఆదేశించారు. ఈవో పీఆర్డీ మాధురి క్షేత్రస్థాయిలో విచారించి కాంట్రాక్టు ఉద్యోగి కిరణ్‌ను బదిలీ చేసి మరో పంచాయతీకి కేటాయించారు. కొత్త ఇంటి పన్ను, అప్రూవల్ లాంటి విషయాలకు సంబంధిత సచివాలయాల్లో నేరుగా సంప్రదించాలని జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి ఓ ప్రకటనలో సూచించారు. ఎవరైనా నగదు డిమాండ్ చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

తిరుపతి-కాట్పాడి-జోలార్‌పేట మెము రైళ్ల రద్దు

పెరంబూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి కాట్పాడి, జోలార్‌పేటకు వెళ్లే మెము రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. తిరుపతి నుంచి సాయంత్రం 6.10 గంటలకు కాట్పాడి బయల్దేరే మెము గురువారం నుంచి ఈ నెల 15 వరకు రద్దయింది. కాట్పాడి నుంచి ఉదయం 6.10, సాయంత్రం 5.15 గంటలకు తిరుపతి బయల్దేరే మెము, తిరుపతి నుంచి ఉదయం 10.35 గంటలకు కాట్పాడి బయల్దేరే మెము రైళ్లు గురువారం నుంచి ఈ నెల 16వరకు తిరగవు. తిరుపతి నుంచి ఉదయం 7.35 గంటలకు కాట్పాడికి బయల్దేరే రైలు, కాట్పాడి నుంచి రాత్రి 9.10 గంటలకు తిరుపతికి బయల్దేరే రైలు, కాట్పాడి నుంచి ఉదయం 10.30 గంటలకు జోలార్‌పేటకు, అక్కడి నుంచి మధ్యాహ్నం 12.55 గంటలకు కాట్పాడికి బయల్దేరే మెము రైళ్లు గురువారం నుంచి ఈ నెల 17 వరకు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలియజేసింది.


వైసీపీ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ జెండా ఎగురవేస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి (జీవకోన), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం వైసీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. పెదిరెడ్డి పార్టీ జెండా ఎగురవేసి, వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. కాగా, వైసీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో ఆయన నివాసం వద్ద పార్టీ జెండాను ఎగురవేసి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ శిరీష, తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు నియోజకవర్గాల సమన్వయకర్తలు భూమన అభినయ్, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, రాజేష్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రోబోల ప్రదర్శన



పాఠశాలలో ప్రదర్శించిన రోబోలు

రామచంద్రాపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో రోబోలు అన్ని రంగాల్లోకి ప్రవేశిస్తాయని ఎంఈవో మార్కొండయ్యనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని గీతాంజలి పాఠశాలలో బుధవారం వివిధ రకాల రోబోల ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నెల్లూరు మాధవి మాట్లాడుతూ రాబోయే కాలంలో రోబోలదే కీలక పాత్ర అన్నారు. విద్యార్థులు తయారు చేసిన రోబోల ప్రదర్శనను పలువురు ఆసక్తిగా తిలకించారు. ప్రిన్సిపాల్‌గోపి చౌదరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుమల శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు బెంగళూరుకు చెందిన మహాలక్ష్మి బుధవారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును శ్రీవారి ఆలయం ముందు టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీఈవో లోకనాథంకు దాత అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



జస్టిస్ మాల



జస్టిస్ పీబీ భజంత్రీ



నిమ్మగడ్డ రమేష్‌కుమార్



శోభా చంద్రశేఖర్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ మాల, పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీబీ భజంత్రీ శ్రీవారి సేవలో పాల్గొన్నారు. అలాగే, రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్, తమిళ సినీ హీరో విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్ కూడా స్వామిని దర్శించుకున్నారు. వీరందరికీ ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 6 గంటలు



తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.86 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,393

తలనీలాలు సమర్పించినవారు: 19,490

● నేడు వరల్డ్ కిడ్నీ డే



కిడ్నీ..శరీరంలో కీలకభూమిక పోషించే అవయవం. రెండు కిడ్నీలు శరీరంలోని వ్యర్థాలను శుభ్రం చేస్తూ మంచి రక్తాన్ని సరఫరా చేస్తాయి. ఈ అవయవాల్లో ఏర్పడే చిన్నపాటి రాళ్లను ఆరంభంలోనే గుర్తించి తొలగించకపోతే తీవ్ర అనారోగ్యం కలగజేస్తాయి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా పరిణమిస్తాయి. ఈనేపథ్యంలోనే కిడ్నీవ్యాధిగ్రస్థులైన పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. రెక్కాడితేగాని డొక్కాడని బతుకులకు ఆరోగ్య భరోసా ఇస్తోంది.

- తిరుపతి (వైద్యం), ఆంధ్రజ్యోతి



డయాలసిస్ చేసుకుంటున్న కిడ్నీ బాధితులు

- కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ అండ
- 1440 మందికి డయాలసిస్ సేవలు
- క్రమం తప్పకుండా నెలవారీ పింఛను

బాధితులకు 'దయా'లసిస్

జిల్లాలో 1440 మంది వరకు కిడ్నీ వ్యాధిబారిన పడి ప్రభుత్వ సాయంతో డయాలసిస్ చేయించుకుంటున్నారు. వీరికోసం ప్రభుత్వం నెఫ్రోప్లస్ ఆధ్వర్యంలో నాలుగు డయాలసిస్ కేంద్రాలను నిర్వహిస్తోంది. తిరుపతి స్విమ్స్‌లో అతి పెద్ద కేంద్రం పనిచేస్తోంది. నెలలో ఇక్కడ 870 మంది డయాలసిస్ సేవలు పొందుతున్నారు. రుయాలో 119, శ్రీకాళహస్తిలో 40, నగరిలో 25 మందికి డయాలసిస్ చేస్తున్నారు. కొన్ని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోనూ ఈ సేవలను అందిస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో హయాంలో నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వం కొవిడ్‌ను సాకుగా చూపి కిడ్నీ బాధితులకు 108 వాహనం ద్వారా కల్పించాల్సిన ఉచిత రవాణాకు స్వస్తి పలికింది. నెలకు ఇవ్వాల్సిన రూ.10 వేల పింఛను కూడా అరకొరగానే అందించింది. దూర ప్రాంతాల నుంచి డయాలసిస్ కోసం వచ్చే వారికి ఈ మొత్తం రవాణా ఖర్చులకు కూడా సరిపోయేది కాదు. పింఛను అందక డయాలసిస్ కూడా చేయించుకునేందుకు రవాణా ఖర్చులు లేక కొందరు మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. దీనికితోడు డయాలసిస్ కేంద్రాల్లో మందుల కొరత, వైద్య పరికరాల కొరత తీవ్రంగా ఉండేది. ఏడాది కిందట బాధితులు స్విమ్స్ వద్ద దీనిపై ఆందోళనకు కూడా దిగాల్సివచ్చింది..

కూటమి సారథ్యంలో మెరుగైన సేవలు

కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యభద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. కిడ్నీ వ్యాధి బాధితులకు పింఛన్లు సక్రమంగా అందడం లేదని గుర్తించింది. ప్రతినెలా నిర్దేశిత సమయానికి అందించేలా చర్యలు తీసుకుంది. ఈ విషయంలో జిల్లా యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. ఫలితంగా ప్రతి నెలా క్రమం తప్పకుండా నిరుపేదలైన బాధితులకు రూ.10 వేల పింఛను అందజేస్తోంది. డయాలసిస్‌కు వచ్చి వెళ్లేందుకు 108 వాహన సదుపాయాన్ని కూడా కల్పించింది.



క్రమం తప్పకుండా ఇస్తున్నారు.

డయాలసిస్ అవసరమైనప్పటి నుంచి ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డాను. గడిచిన మూడేళ్లలో డయాలసిస్ కోసం వెళ్లడానికి కూడా డబ్బులుండేవి కావు. కూటమి ప్రభుత్వం వచ్చాక పద్ధతిగా పింఛను ఇస్తున్నారు. ఉద్యోగుల జీతాల కంటే ముందుగానే మాలాంటి వాళ్లకు నెలకు రూ.10వేలు ఇస్తున్నారు.

- మునస్వామి, కేవీఆర్‌పురం

ఏడాది క్రితం ఎన్ని కష్టాలో..

ఏడాది కిందట పింఛను కోసం నానా అగచాట్లు పడ్డాను. అధికారుల చుట్టు తిరిగినా నెలలు తరబడి ఇవ్వలేదు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. నాలుగు నెలలుగా క్రమం తప్పకుండా పింఛను అందుతోంది. ఇప్పుడు బాగానే ఉంది.

- వెంకటేష్, వరదయ్యపాళెం





పింఛనే బతుకు మార్గమైంది..

గతంలో పింఛను సక్రమంగా అందక చాలా ఇబ్బందులు పడేదాన్ని. మందులు కొనుక్కోడానికి చేతిలో డబ్బులు లేక నరకం అనుభవించాను. ప్రస్తుతం ఆ సమస్య లేదు. ప్రతి నెలా రూ.10 వేల పింఛను అందుతోంది. ఆ మొత్తం మందులకే కాదు జీవనోపాధికి కూడా తోడ్పడుతోంది

- శకుంతల, మంగళం(తిరుపతి)



- ఆకట్టుకున్న 'విరించి-2కె25' ప్రదర్శనలు
- పద్మావతి వర్సిటీలో వేడుకలు ప్రారంభం

సాంస్కృతికోత్సాహం







తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ బుధవారం సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికైంది. సంగీత సాహిత్య సమలంకృతే.. స్వర రాగ పదయోగ సమ భూషితే.. అంటూ రెండు రోజుల పాటు విరించి-2కె25 పేరిట జరిగే కళావేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని, కూచిపూడి నృత్యకారిణి డాక్టర్ హిమబిందు కనోజ్ ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. క్రీడా, సాంస్కృతిక అంశాల ద్వారా సృజనాత్మకత, మానసిక వికాసం ఏర్పడతాయన్నారు. యూనివర్సిటీలో సంగీత, సాహిత్యాల్లో బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో అద్వితీయమైన కృషి సాగిందన్నారు. ఇటీవల నోయిడాలోని అమెటి యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో తమ విద్యార్థులు విజేతలుగా నిలిచారని గుర్తు చేశారు. అనంతరం నిర్వహించిన వివిధ సంగీత, నృత్య ప్రతిభా పోటీలు ఆకట్టుకున్నాయి. ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియంలో సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





మిస్ విరించిగా హీనా సయ్యద్

విరించిలో భాగంగా ఫ్యాషన్ షో నిర్వహించారు. లా డిపార్ట్‌మెంట్‌కు చెందిన హీనా సయ్యద్ మొదటి స్థానంలో నిలిచి మిస్ విరించిగా ఎంపికయ్యారు. ఎల్ఎల్‌బీ విద్యార్థిని నాగభవానీ ద్వితీయ, సీఎస్ఈ విద్యార్థిని ఎన్.మనస్విని మూడవ స్థానంలో నిలిచారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

నాయుడుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలోని పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుడు ప్రభాకర్‌ను హనీట్రాప్ అంశంపై సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓ దళిత విద్యార్థినిపై హనీట్రాప్ జరిగిందన్న అభియోగంపై గూడూరు డీవైఈవో, విచారణ అధికారి సనత్‌కుమార్ ఇచ్చిన ప్రాథమిక నివేదిక మేరకు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మామండూరులో ఈతకు వెళ్లి బీటెక్ విద్యార్థి మృతి



ఆకాష్ మృతదేహం

రేణిగుంట, మార్చి 12, (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం మామండూరులో ఈతకు వెళ్లి బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం మధ్యాహ్నం జరిగింది. రేణిగుంట అర్బన్ ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపిన ప్రకారం.. తిరుపతిలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్న 10 మంది విద్యార్థులు మామండూరుకు వెళ్లారు. ఇక్కడ అటవీ సిబ్బంది దగ్గర టిక్కెట్లు కొని గెస్ట్ హౌస్‌లో విశ్రాంతి తీసుకున్నారు. ఆ తర్వాత నీటిలో ఈత కొడుతుండగా ఆకాష్ (20) మునిగిపోయాడు. సహచరులు అతడిని వెలికితీసి పోలీసులకు, 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకని విద్యార్థిని రుయాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీయూలో మాస్టర్ ప్లాన్

రోడ్ల నిర్ణయం రద్దు

- శాసన మండలిలో మంత్రి నారాయణ ప్రకటన
- విద్యార్థి సంఘాల హర్షం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఎస్వీయూ విద్యార్థులు.. పూర్వ విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు.. ఇప్పుడు ఫలితం లభించింది. ఎస్వీయూలో మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్ణయాన్ని రద్దు చేస్తున్నట్లు బుధవారం శాసన మండలిలో మంత్రి నారాయణ ప్రకటించారు. దీనిపై విద్యార్థి సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి. చంద్రగిరి- తిరుపతి రోడ్డుకు, అలిపిరి- జూపార్క్‌ను కలిపే మూడు రోడ్లను రూ. 4 కోట్లకు పైగా ఎస్వీ యూనివర్సిటీ లోపలి నుంచే వేయాలని గతంలో నిర్ణయించారు. జూపార్క్ సమీపంలో గల ఒబెరాయ్ హోటల్‌ను అనుసంధానించడానికే ఈ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారంటూ అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. ఎస్వీయూనివర్సిటీ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు కూడా మాస్టర్ ప్లాన్ రోడ్లను వ్యతిరేకించారు. అనేక విద్యార్థి సంఘాలు ఒక్కటిగా యూనివర్సిటీ వేదికగా పటిష్ఠ ఉద్యమాన్ని చేపట్టారు. అయినా, అప్పట్లో ప్రజాప్రతినిధులు సానుకూలంగా స్పందించలేదు. ఆ కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఈ క్రమంలో యూనివర్సిటీ మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్ణయాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నిర్ణయం మంచి పరిణామమని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. శాసనమండలిలో ఈ అంశాన్ని లేవనెత్తిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డికీ, మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్ణయాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుచానూరులో ఐజీఎన్‌సీఏ ప్రాంతీయ కేంద్రం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అపురూపమైన భారతీయ కళా వారసత్వాన్ని పరిరక్షించుకోవలసిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సహకారంతో ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ద ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ) ద్వారా తిరుచానూరులో బుధవారం 10వ ప్రాంతీయ కేంద్రాన్ని ప్రారంభించారు. సంస్కృత వర్సిటీకి మాజీ స్పీకర్ దివంగత మాడభూషి అనంతశయనం అయ్యంగార్ గతంలో ఇచ్చిన భవనంలో దీనిని నిర్వహించనున్నారు. కేంద్రాన్ని ఐజీఎన్‌సీఏ మెండర్ సెక్రటరీ డాక్టర్ సచ్చిదానందజోషి, డైరెక్టర్ ప్రియాంకమిశ్రా, సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ వెంకటనారాయణ, పులివర్తి సుధారెడ్డి ప్రారంభించారు. వైష్ణవ ఆగమాలు, శిల్ప కళల్ని ప్రోత్సహించి ఆధునిక తరానికి అందించాలని సంకల్పించడం గొప్ప విషయమన్నారు.. కాశీ నుంచీ తెచ్చిన అగస్త్య మహర్షి ప్రతిమను ఈ సందర్భంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో పద్మ సుబ్రమణ్యం, ఢిల్లీకి చెందిన విద్యావేత్త మాళవికాజోషి, పాండిచ్చేరి రీజినల్ సెంటర్ డైరెక్టర్ రాఘవన్, అసిస్టెంట్ డైరెక్టర్ అనితాసూరి, ప్రొఫెసర్ సుమిత్, సంస్కృత వర్సిటీ డీన్ ప్రొఫెసర్ దక్షిణామూర్తిశర్మ, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు కనపాల కుమార్, పీఆర్వో రమేష్‌బాబు పాల్గొన్నారు.



ప్రారంభ కార్యక్రమంలో డాక్టర్ సచ్చిదానందజోషి, డైరెక్టర్ ప్రియాంకమిశ్రా, సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ వెంకటనారాయణ, పులివర్తి సుధారెడ్డి

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 17 నుంచి 31వ తేదీ వరకు 164 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 28,656 మంది విద్యార్థులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ చెప్పారు. ఈనెల 17 నుంచి 31వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 28,656 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల నుంచి 15,455 మంది, ప్రైవేటు స్కూళ్ల నుంచి 11,548 మంది, 634 మంది ప్రైవేటు విద్యార్థులు, 1,019 మంది ఓపెన్ స్కూల్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

164 కేంద్రాల ఏర్పాటు

పరీక్షల కోసం జిల్లాలో 164 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 89 ఎ గ్రేడ్ (సమీపంలో పోలీస్ స్టేషన్, ఖజానా కార్యాలయాలు ఉన్నవి), 55 బి గ్రేడ్ (సమీపంలో పోలీస్ స్టేషన్ లేదా ఖజానా కార్యాయాల్లో ఒకటి మాత్రమే ఉన్నవి), 20 సి-గ్రేడ్ (పోలీస్ స్టేషన్, ట్రెజరరీ రెండూ దూరంగా ఉన్న కేంద్రాలు) కేంద్రాలుగా అధికారులు గుర్తించారు. అందుకు తగినట్లు నిఘా, భద్రతా ఏర్పాట్లు చేశారు.

39 పోలీస్ స్టేషన్లలో ప్రశ్నపత్రాలు

పరీక్షా కేంద్రాలకు సకాలంలో, అనువుగా తరలించేందుకు వీలుగా ప్రశ్నపత్రాలను సమీప పోలీస్ స్టేషన్లలో భద్రపరిచారు. పరీక్షకు కొంత సమయం ముందు వాటిని రూట్ ఆఫీసర్ల ద్వారా పోలీసు భద్రతతో కేంద్రాలకు తరలించనున్నారు.

పరీక్షల విధులకు 1,904 మంది

ఇక పరీక్షల నిర్వహణకు 1,904మంది సిబ్బందిని నియమించారు. వీరిలో 1,476మంది ఇన్విజిలేటర్లు ఉన్నారు.ఒక్కో బృందంలో రెవెన్యూ, పోలీసు, విద్యాశాఖకు చెందిన ముగ్గురు అధికారులతో కూడిన 6ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. 30 సిట్టింగ్ స్క్వాడ్లు, 164మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 164 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్లు 40 మంది, రూట్ ఆఫీసర్లు 10 మంది, అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లు 10 మంది ఉన్నారు.



వందశాతం ఉత్తీర్ణకు కృషి

పదవ తరగతి పరీక్షల్లో జిల్లా వందశాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. 100 రోజుల ప్రత్యేక ప్రణాళికను పక్కాగా అమలు చేస్తున్నాం. ఇప్పటికే రెండు గ్రాండ్ టెస్టులు, సన్నాహక పరీక్ష, ప్రీఫైనల్ పరీక్షలను నిర్వహించాం. ఎటువంటి అవకతవకలకూ ఆస్కారం లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు ఒకరోజు ముందుగానే వారి పరీక్ష కేంద్రాలను చూసుకోవాలి. పరీక్షకు గంట ముందుగా కేంద్రం వద్దకు చేరుకోవాలి.

- కోట వెంకట నాగేంద్రకుమార్, డీఈవో

ఇంటర్ పరీక్షలకు 598 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలకు 598 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. బుధవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిజిక్స్, ఎకనమిక్స్ పేపర్-2 పరీక్షలు జరిగాయి. 29,639 మంది హాజరుకావాల్సి ఉండగా 29,041 మంది మాత్రమే పరీక్షలు రాశారు. 598 మంది హాజరుకాలేదని, జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ చోటుచేసుకోలేదని ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు



స్పీడ్‌గన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

చిల్లకూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నియంత్రిం చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. బుధవారం మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలో స్పీడ్ గన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పీడ్ గన్ ద్వారా అతివేగంగా వచ్చే వాహనాలను, వ్యతిరేక దిశలో వెళ్లే వాహనాలను, హెల్మెట్, ధృవీకరణ పత్రాలు లేని వాహనదారులను గుర్తించి జరిమానా విధించడం జరుగుతుందన్నారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న పరిశ్రమ ప్రతినిధులు, గ్రామస్తులు

ఓజిలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం అత్తివరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ప్రహరీ నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించిన టీడీపీ సీనియర్ నేత, కుందాం సొసైటీ మాజీ చైర్మన్ కనుమూరు గోపాలరెడ్డి అత్తివరం పంచాయతీ పరిధిలోని బీజేడీ ఆక్సైడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పరిశ్రమ యాజమాన్యం కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద రూ.8 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించింది. దీంతో బుధవారం ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్లు గురుమూర్తి, అనిల్‌రెడ్డి, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీకి యత్నం

నాయుడుపేట టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహార పేటలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ యత్నం జరిగింది. మంగళవారం అర్ధరాత్రి ఆలయ ప్రధాన గేటు తాళాలు పగలగొట్టి లోపలకు ప్రవేశించిన దొంగలు హుండీ చోరీకి యత్నించారు. హుండీ తలుపు తెరుచు కోకపోవడంతో వెళ్లిపోయారు. ముగ్గురు యువకులు మోటరు సైకిల్‌పై వచ్చి చోరీకి యత్నించినట్లు సీసీ కెమెరాలో నమోదై ఉంది. పోలీసులు సంఘట నాస్థలికి చేరుకొని వివరాలు నమోదు చేసుకొని సీసీ ఫుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రవేశానికి నోటిఫికేషన్

వెంకటగిరి టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ప్రవేశానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ తులసీ జ్యోతి బుధవారం తెలిపారు. ఈనెల 17 నుంచి మే 22వ తేదీ వరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

గూడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎల్ఏపీ పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్ జిల్లాల ఆర్చరీ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు లక్ష్మీ షణ్ముకమనదీప్, లోహిత్ కుమార్ యాదవ్, చంద్రతేజ, చరిత్ జాతీయస్థాయికు ఎంపిక య్యారని తెలిపారు. ఈనెల 20నుంచి 29వ తేదీ వరకు గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కోచ్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

గూడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణంలో బుధవారం వైసీపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం నామమాత్రంగా జరిగింది. అంబేద్కర్ నగర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శుభాన్, అఖిల్, రాఘవరెడ్డి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు. వైసీపీ ఆవిర్భావ దినోత్సవంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కానీ, సీనియర్ నాయకులు కానీ పాల్గొనకపోవడం చర్చనీయాంశం అయింది.

ఓజిలి: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద వైఎస్సార్ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. బస్టాండు వద్ద పార్టీ జెండా ఎగుర వేశారు. మండల కన్వీనరు హరినాథరెడ్డి, ఎంపీపీ అరుణమ్మ, వైస్ ఎంపీపీ ప్రసాద్‌నాయుడు, అరిమేనిపాడు ఎంపీటీసీ గుంటమడుగు రఘురామరాజు తదితరులు పాల్గొన్నారు.

కోట: స్థానిక క్రాస్‌రోడ్డులో వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ మండల కన్వీనర్ సంపత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సాయిప్రసాద్‌రెడ్డి, హరి చంద్రారెడ్డి, చెంచురాఘవరెడ్డి, నాగూర్‌రెడ్డి, రమణయ్య, జగదీష్, విజయ సారథిరెడ్డి, పాముల సురేంద్ర, సుధారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నివాసం వద్ద వైసీపీ పట్టణ అధ్యక్షుడు కలికి మాధవరెడ్డి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, కురుగొండ ధనలక్ష్మి, బైనా మల్లికార్జున్‌రెడ్డి, జయరామయ్య పాల్గొన్నారు.

వాకాడు: మండలంలోని అశోక్‌పిల్లర్ సమీపంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి కొడవలూరు భక్తవత్సల్ రెడ్డి, ఏనుగు సుధాకర్‌నాయుడు, దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, వాకాటి జనార్ధన్‌రెడ్డి, వాకాటి రవి, తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో వైసీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ ఆవిర్భవ దినోత్సవం నిర్వహించారు వైసీపీ కౌన్సిలర్ వహిద, ఆరి శంకరయ్య, కల్యాణి, సుజాత, పేచీరాజ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో వేర్వేరుగా

సూళ్లూరుపేట: పట్టణంలో వైసీపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వ్యతిరేకం వర్గం, అనుకూల వర్గం వేర్వేరుగా నిర్వహించాయి. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండా ఎగరవేశారు. ఆర్టీసీ బస్టాండు వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అదేవిధంగా వైసీపీ పట్టణ అధ్యక్షుడు వేలపాలెం కృపాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి కార్యాలయం వద్ద పార్టీ జెండా ఎగురవేశారు. తడ ఎంపీపీ కొళవి రఘురెడ్డి, వైసీపీ నాయకులు తిరుపాల్, గండవరం సురేష్ రెడ్డి, జెట్టి వేణుయాదవ్, కళత్తూరు సునీల్ రెడ్డి, యుగంధర్, అలవల సురేష్, మీజూరు రామకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



ప్రణీత్(ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయినగర్‌కు చెందిన ప్రణీత్(21) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాలను ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో సేకరించి చెన్నై శంకరనేత్రాలయకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు చంద్రబాబు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని బిహార్‌వాసి ఆత్మహత్య



మృతిచెందిన ఇస్మాయిల్

గూడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడివయ్య కాలనీ సమీపంలోని బేల్దారి కాలనీలో నివాసం ఉంటున్న బిహార్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్(35) ఆత్మహత్య చేసుకున్నాడు. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు.... మహ్మద్ ఇస్మాయిల్(35) మూడేళ్లుగా బేల్దారికాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ బేల్దారి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అతని కుటుంబ సభ్యులు బిహార్‌లోనే ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో తీవ్ర మనస్థానానికి గురైన ఇస్మాయిల్ తాను అద్దెకు ఉంటున్న ఇంట్లో ఫ్యాన్‌కు బుధవారం ఉరేసుకుని మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ట్రాఫిక్ సమస్య తీరదా?



సంగం థియేటర్ సెంటర్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

గూడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతుండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో సంగం థియేటర్ సెంటర్ నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు తరచుగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ప్రధానంగా పట్టణంలోకి ఆర్టీసీ బస్టాండు నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి సంగం థియేటర్, కుమ్మరవీధి సెంటర్ మీదుగా ఆస్పత్రి రోడ్డు గుండా రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఈ మార్గం ద్వారానే ఇటు చిల్లకూరు, జాతీయ రహదారి వైపు, అటు వెంకటగిరి, రాపూరు మార్గాల్లోనూ రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. అంతేకాకుండా పలు ప్రభుత్వ కార్యాలయాలు, ఏరియా ఆస్పత్రి, విద్యాసంస్థలు, సమీప గ్రామాల నుంచి పట్టణంలోకి వచ్చేవారు ఈ మార్గంలోనే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. దీంతో ఉదయం 9 గంటల నుంచి, సాయంత్రం 7 గంటల వరకు ఈ మార్గంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. ఇదే సమయంలో మేతకు వెళ్లే పశువులు కూడా ఈ దారి నుంచే వెళుతుండంతో ట్రాఫిక్‌లో చిక్కుకుపోవాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ఈ రహదారి వెంబడే దుకాణాలు, ఆస్పత్రులు ఉండడంతో వాహనాల పార్కింగ్ వల్ల రాకపోకలకు అడ్డంకిగా మారుతోంది. ఒక్కసారి ట్రాఫిక్ నిలిచిపోతే సుమారు అర కిలోమీటర్ వరకు వాహనాలు బారులు తీరుతున్నాయి. అధికారులు స్పందించి పట్టనంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమాజ నిర్మాణంలో మహిళలే కీలకం



మహిళా దినోత్సవ ముగింపు కార్యక్రమంలో డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ భారతి హరిశంకరన్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, డిప్యూటీ డైరెక్టర్ గ్రహదురై తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో మహిళలే కీలకమని కోయంబత్తూరు డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ భారతి హరిశంకరన్ అన్నారు. బుధవారం సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో జాతీయ మహిళా దినోత్సవ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగి భారతి హరిశంకరన్ విచ్చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు పోటీ పడుతూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ముఖ్యంగా ఇస్రో కీలక విభాగాల్లో మహిళలు శాస్త్రవేత్తలుగా ఎదిగి ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపుతుండడం దేశానికే గర్వకారణమన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. మహిళా ఉద్యోగులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసులు రెడ్డి, ఆర్‌వో డిప్యూటీ డైరెక్టర్ గ్రహదురై, రమేష్ బాబు, షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



కమిషనర్ కృష్ణతేజకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజను ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కోరారు. బుధవారం విజయవాడలో కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే నియోజకవర్గ పరిధిలో ఉపాధి పథకం కింద చేపట్టాల్సిన పనుల గురించి వివరించారు. ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు.

కాలువ పూడ్చారు

వెంకటగిరిటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోలిమిట్ట అంకమ్మ చెట్టు వీధిలో తవ్విన కాలువను మున్సిపల్ సిబ్బంది పూడ్చి వేయించారు. అంకమ్మ చెట్టు వీధిలో పైపులైన్ దెబ్బతిని ఏడాదిగా నీళ్లు రావడం లేదని స్థానికులు ఫిర్యాదు చేయడంతో మున్సిపాలిటీ సిబ్బంది మరమ్మతుల కోసం కాలువ తవ్వి వదిలేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో బుధవారం కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఎక్స్‌కవేటర్ సాయంతో కాలువను పూడ్చి వేసి వీధిలో మట్టి లేకుండా శుభ్రం చేయించారు.

రైస్ మిల్లును తరలించండి

సూళ్లూరుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం వట్రపాలెం ప్రాంతంలో ఇళ్లకు అనుకొని ఉన్న రైస్‌మిల్లును అక్కడి నుంచి తరలించాలని కోరుతూ స్థానికులు బుధవారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఏడీపీఎస్ నాయకుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వట్రపాలెం వాసులు ఆర్డీవో కార్యాలయానికి చేరుకొని నిరసన తెలిపారు. రైస్‌మిల్లు నుంచి వెలువడుతున్న ధూళి వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జనావాసాల మధ్య ఉన్న రైస్‌మిల్లును అక్కడి నుంచి తరలించాలని ఆర్డీవో కార్యాలయ ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

కలుజు ఎత్తు పెంచడంతో నీట మునిగిన పంట పొలాలు

పెళ్లకూరు, మార్చి 12 (ఆంధ్రజోతి): దొరవారిసత్రం మండలం వేణుంబాక చెరువు కలుజు ఎత్తు పెంచడంతో తమ పంటలు నీట మునిగాయని పెళ్లకూరు మండలంలోని బంగారంపేట రైతులు వాపోతున్నారు. బాధిత రైతులు గుండుబోయిన పులయ్య, సమాధి శ్రీనివాసులు, బుడతోటి డిల్లెయ్య, మహేష్, మస్తాన్, బందిల చంద్రయ్య, శంకరయ్య, వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, సురేష్ తదితరులు మాట్లాడుతూ వేణుంబాక చెరువు కలుజు ఎత్తు పెంచడంతో అలుగుకు కూడా మట్టిని అడ్డుగా పోసేశారని, దీంతో తమ వరి పంటలు నీట మునగాయన్నారు. పంటల కోత వరకు నీళ్లు తగ్గించాలని వేణంబాకం రైతులను కోరితే అంగీకరించడం లేదని, పంటల్లో నీళ్లుంటే కోతలు ఎలా చేపట్టాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

నిమ్మలో సస్యరక్షణపై అవగాహన

వెంకటగిరి టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నిమ్మ సాగుతో నిర్ణీత సమయాల్లో సస్యరక్షణ తప్పనిసరిగా చేపట్టాలని ఉద్యానవన శాఖ అధికారి దశరథరామి రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక నిమ్మ, చీని పరిశోధన కేంద్రం వద్ద రైతులకు అవగాహన కల్పించారు. పురుగు మందుల వాడకాన్ని తగ్గించి జీవన ఎరువులు వాడాలన్నారు. భూమిలో సేంద్రియ కర్బనం పెంచితే తెగుళ్ల ఉధృతి తగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌వో ఆనంద్‌రెడ్డి, శారద, కార్తీక్, భరద్వాజ్, రైతులు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

కోట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కోట మండలం పెదగోవిందపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం మంజు క్రాంతి అధినేత దేవీసింగ్, నగేష్ దాతృత్వంతో పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ హెచ్‌ఎం గిరిధర్‌బాబు, ఉపాధ్యాయులు సరస్వతీ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు తిరుమూరు మురళి, అనూక్, దిలీప్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

పీ-4 సర్వేని పకడ్బందీగా నిర్వహించాలి

వాకాడు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన పీ-4 సర్వేని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. మండలంలోని నెలిపూడి సచివాలయంలో బుధవారం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల లాగిన్‌లలో ప్రతి ఇంటికి సంబంధించిన డేటా అందుబాటులో ఉందన్నారు. సిబ్బంది విధిగా ఇంటింటికీ వెళ్లి 16 అంశాలపై పూర్తి డేటాను సేకరించి ఎంట్రీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ జితేంద్ర, మహిళా పోలీస్ అమరావతి, ఏఎన్ఎం నాగమణి, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన శ్రీనివాసులు

చిల్లకూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట క్రాస్‌రోడ్డు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... గూడూరు మండలం పోటుపాళెం గ్రామానికి చెందిన శ్రీనివాసులు(45) గూడూరు వైపు నుంచి రెట్టపల్లి గ్రామానికి బైక్ వెళుతుండగా అదుపుతప్పి జాతీయ రహదారికి పక్కన ఉన్న టెలిఫోన్ స్థంభాన్ని ఢీకొని మృతిచెందాడు. డీఎస్పీ గీతాకుమారి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేల స్థావరంపై దాడులు ఏడుగురి అరెస్టు

డక్కిలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం ఆల్తూపాడు అడవుల్లో కోడి పందేల స్థావరంపై ఎస్ఐ శివశంకర్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం సాయంత్రం దాడి చేశారు. ఏడుగురిని అరెస్టు చేసి, మూడు కోళ్ల, రూ.8150 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వేణుగోపాలుడికి గరుడసేవ

సూళ్లూరుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మంగళంపాడులో వెలసిన సౌందర్యవల్లీ రుక్మిణీ సత్యభామా గోదా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం వేణుగోపాలుడు గరుడ వాహనంపై గ్రామవీధుల్లో ఊరేగారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకొన్నారు.

పరీక్షల్లో ఒత్తిడికి గురికావొద్దు

సూళ్లూరుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దని మన్నారుపోలూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర రెడ్డి అన్నారు. బుధవారం పాఠశాలలో సరస్వతి పూజ నిర్వహించారు. విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే సూళ్లూరుపేట బాలికల పాఠశాల, కోట పోలూరు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సరస్వతి పూజ నిర్వహించారు.

బస్టాండ్‌లోకి దూసుకెళ్లిన లారీ తృటిలో తప్పిన ప్రమాదం

కోట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైక్రోటవర్ కాలనీ వద్ద బుధవారం ఓ ఖాళీ లారీ పాడుబడిన బస్టాండ్‌లోకి దూసుకువెళ్లింది. గూడూరు నుంచి కోట వైపు వెళ్తున్న లారీ మైక్రోటవర్ కాలనీ వద్ద అదుపుతప్పి పాడుబడిన బస్టాండ్‌లోకి వెళ్లింది. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

క్రమశిక్షణతోనే లక్ష్య సాధన



సరస్వతీదేవి పూజలో విద్యార్థులు

డక్కిలి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే అనుకొన్న లక్ష్యాన్ని సులభంగా చేరుకొంటారని వెంబులూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెరుకూరి చెన్నయ్య అన్నారు. బుధవారం పాఠశాలలో సర్వస్వతీ దేవి పూజ నిర్వహించారు. అలాగే విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లిఖార్జున రావు, విద్యా కమిటీ చైర్మన్ పాయసం సులోచనమ్మ, గాలి గోపాలయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేద మహిళలకు దుస్తుల పంపిణీ

గూడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఎంఎఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక షాదీమంజిల్‌లో 786 మంది పేద మహిళలకు దుస్తులను పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు మగ్దూం మాట్లాడుతూ పేదలందరూ రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో దుస్తులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో నాశిన భాస్కర్‌గౌడ్, కడివేటి చంద్రశేఖర్, రియాజ్‌అహ్మద్, జమాలుల్లా, షఫీమౌలానా, అన్వర్ బాషా, షబ్బీర్, ఎల్‌వీ సుబ్బయ్య, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవికి పూజలు

గూడూరు అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విందూరు ఉన్నత పాఠశాలలో బుధవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీదేవికి పూజలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ పదో తగరతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల దోపిడీ

తక్కువ వడ్డీతో రుణాలిస్తామని వల
ప్రాసెసింగ్ ఫీజు పేరిట 40శాతం లాగేస్తున్నవైనం
చక్రవడ్డీతో అప్పుల ఊబిలోకి బాధితులు

వెంకటగిరి టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల దోపిడీ రోజు రోజుకు మితిమీరిపోతోంది. పుట్టగొడుగుల్లా వెలిసిన ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు తక్కువ వడ్డీతో రుణాలిస్తామని ఆశల వల విసురుతున్నాయి. తీరా ఇచ్చిన రుణంలో 40శాతం వరకు ప్రాసెసింగ్ ఫీజు కింద లాగేసుకుంటున్నాయి. తరువాత కంతులు సరిగా చెల్లించలేదంటూ చక్ర వడ్డీ వేసి ప్రజలను పీడించి దోచుకుతింటున్నాయి. ఇటీవల పట్టణంలోని బొగ్గులమిట్టకు చెందిన షేక్ పీర్మ లక్ష రూపాయలు అవసరం కావడంతో ఓ ఫైనాన్స్ కంపెనీని ఆశ్రయించింది. ఆ సంస్థ ప్రతినిధులు వచ్చి షేక్ పీర్మ ఇంటి స్థలం కొలతలు వేసి పట్టా డాక్యుమెంట్ తీసుకున్నారు. సదరు ఇంటి విలువ ప్రకారం నాలుగు లక్షల రూపాయల రుణం ఇవ్వగలమని తెలిపారు. ఇది ప్రభుత్వం ఇచ్చిన పట్టా కాబట్టి తామే రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని సంతకాలు పెట్టించుకున్నారు. ఇదంతా పూర్తయ్యాక రిజిస్ట్రేషన్ కోసం రూ.1.5లక్షలు ఖర్చు అయిందని చెప్పి రూ.2.5 లక్షలు మాత్రమే చేతిలో పెట్టారని షేక్ పీర్మ వాపోయింది. అలాగే సాలాపక్షి ధనమ్మ అనే మహిళ ఓ ఫైనాన్స్ కంపెనీ నుంచి రూ.3లక్షలు అప్పు తీసుకుంది. ఒక్క నెల కంతు కట్టడంలో ఆలస్యమయ్యే సరికి ఇంటి వద్దకు వచ్చి అసభ్యంగా మాట్లాడారని, వెంటనే చెల్లించకపోతే ఇంటికి తాళం వేస్తామని బెదిరించారని సదరు మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. రుణం తీసుకున్నాక మొదటి కంతు చెల్లించడంలో నాలుగు రోజులు ఆలస్యం అయినందుకు ఇళ్ల వద్ద ఆడవాళ్లు ఉన్న సమయంలో వచ్చి తాళాలు వేస్తామని బెదిరిస్తున్నారని ఓ వ్యక్తి వాపోయాడు. ఈ విషయమై స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యురాలు అజిత మాట్లాడుతూ ఫైనాన్స్ కంపెనీలు తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తామని మధ్య తరగతి ప్రజలను మోసం చేయడం దారుణమని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న వాహనం



ఒరిగిన విద్యుత్ స్తంభం

సూళ్లూరుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ ఆలయ సమీపంలోని శ్రీనగర్ కాలనీ వద్ద జీఎన్‌టీ రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాన్ని గుర్తుతెలియని ఢీకొంది. ఈ ప్రమాదంలో స్తంభం ఒరిగిపోవడంతో దాదాపు గంటపాటు సరఫరాలో అంతరాయం కలిగింది. అదేవిధంగా సూళ్లూరు ప్రధాన వీధిలో విద్యుత్ లైన్ తెగి దాదాపు రెండు గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం కలిగింది. వెంటనే స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు సరఫరా పునరుద్ధరించారు.

బకాయిల కోసం టిప్పర్ల యజమానుల నిరసన

కోట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చంద్రశేఖరపురం వద్ద ఉన్న ఆప్కో కార్యాలయం ఎదుట బుధవారం టిప్పర్ల యజమానులు రవాణా బకాయిలు చెల్లించాలంటూ నిరసన తెలిపారు. మండలంలో సాగరమాల రోడ్డు పనులు చేస్తున్న సంస్థ నుంచి నాయుడుపేట, మనుబోలు, నెల్లూరు, శ్రీకాళహస్తి, చంద్రగిరి ప్రాంతాలకు చెందిన పలువురు టిప్పర్ల యజమానులు సబ్ కాంట్రాక్టు తీసుకుని ఫ్లైయాష్ రవాణా చేశారు. అయితే 9నెలలు బిల్లులు చెల్లింకపోవడంతో రూ.1.30 కోట్లు బకాయిలు ఉన్నాయి. దీంతో ఆప్కో కార్యాలయం వద్ద బైఠాయించి సంస్థ వాహనాలను అడ్డుకున్నారు. ఎస్ఐ పవన్‌కుమార్ సంఘట నాస్థలికి చేరుకొని ఇరువర్గాలతో చర్చించారు. బకాయిలు చెల్లించేందుకు కొంత సమయం కావాలని కాంట్రాక్టర్ కోరడంతో టిప్పర్ల యజమానులు సమ్మతించి వెళ్లిపోయారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక



హర్షవర్ధన్‌ను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం మధుసూదన్

గూడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జీఎస్ఆర్ పాఠశాల విద్యార్థి హర్షవర్ధన్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపికైనట్లు హెచ్‌ఎం మధుసూదన్‌రావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని కావాలిలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించి పోటీల్లో హర్షవర్ధన్ ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈనెల 14నుంచి 16వ తేదీ వరకు కడప జిల్లాలో జరగనున్న పోటీల్లో హర్షవర్ధన్ పాల్గొంటాడన్నారు. హర్షవర్ధన్‌ను హెచ్‌ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య అభినందించారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడికి సత్కారం

పెళ్లకూరు, మార్చి 12 (ఆంధ్రజోతి): మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలో బుధవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి జన్మదిన వేడుకలు జరిగాయి. బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, మాజీ అధ్యక్షుడు గోగుతట్టు మురళి, జనసేన అధ్యక్షుడు మల్లాం విజయ్ ఆధ్వర్యంలో నరేంద్రరెడ్డిని గజమాల, దుశ్శాలువాలతో సత్కరించారు. కేక్ కట్‌చేసి పంచి పెట్టారు. పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎద్దల సురేష్‌రెడ్డి, వీరయ్య, వెంకయ్య, గణేష్, భరత్, కొమ్మతోటి సుబ్రహ్మణ్యం(కైలాస్), కవిత, వరలక్ష్మి, లక్ష్మి, సతీష్ పృధ్వీరాజ్, వెంకట రమణయ్య, వినయ్, బుజ్జమ్మ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



నరేంద్రరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టింది జగనే

టీఎన్ఎస్ఎఫ్ నేత లక్ష్మణ్



శ్రీకాళహస్తి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టింది మాజీ సీఎం జగన్ పరిపాలనే అని నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కోబాకు లక్ష్మణ్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ... ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2,832కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ.989కోట్లు బకాయిలు పెట్టి బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చుని నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల వ్యవధిలోనే రూ.6.5లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకువచ్చినట్లు గుర్తు చేశారు. దీంతో సుమారు నాలుగు లక్షల మంది నిరుద్యోగ యువత భవిష్యత్తు మారబోతుందన్నారు. నిరుద్యోగ యువతకు మాట ఇచ్చి మడమ తిప్పిన జగన్ వారి భవిష్యత్తు గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. జీవో 77 తెచ్చింది గత జగన్ ప్రభుత్వమన్నారు. అదే జీవోను రద్దు చేయాలనడం హాస్యాస్పదమన్నారు. విద్యార్థుల భవిష్యత్తు పట్ల కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు.

'దిల్‌రూబ' అన్ని వర్గాలను అలరిస్తుంది



మీడియాతో మాట్లాడుతున్న కిరణ్ అబ్బవరం

తిరుపతి అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తాను కథానాయకుడిగా నటించిన దిల్‌రూబ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని యువ హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. ఈ చిత్రం హోలీ (14న) రోజున విడుదలవుతుండడం సంతోషంగా ఉందన్నారు. బుధవారం సాయంత్రం చిత్రబృందంతో కలిసి ఆయన ఓ హోటల్లో మీడియాతో మాట్లాడారు. ఇది తన 10వ సినిమా అని, ఇందులో తన పాత్ర సరికొత్తగా ఉంటుందన్నారు. కొత్తవారికి సినిమాల్లో అవకాశం రావడం లేదని, ముఖ్యంగా రాయలసీమ నుంచి వచ్చేవారికి చాలా తక్కువని ఆవేదన వ్యక్తం చేశారు. కిందిస్థాయి నుంచి వచ్చిన తాను సమాజ సేవకు కృషి చేస్తానన్నారు. హీరోయిన్ రుక్సాదిల్లాన్ మాట్లాడుతూ కృష్ణార్జునుల యుద్ధం తర్వాత ఈ సినిమాలో అవకాశం లభించిందని తెలిపారు. మరో నటి నజియా మాట్లాడుతూ తొలిసారిగా నటించిన ఈ సినిమాలో తన పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంటుందన్నారు.

పుత్తూరు వార్తలు

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగేనా?

● 15వ తేదీకి మళ్లీ మార్పు



పుత్తూరు అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహణకు ముహూర్తం కుదరడం లేదు. ఈనెల 13న గురువారం జరగాల్సిన సమావేశం 15వ తేదీకి మార్చారు. ఇప్పటికే మూడు పర్యాయాలు సమావేశం వాయిదా పడింది. ఫిబ్రవరి 28న జరగాల్సిన సమావేశం అభివృద్ధి పనులు అజెండాలో పొందపరిచే విషయంలో కౌన్సిలర్ల మధ్య తలెత్తిన మనస్పర్థలతో వాయిదా పడింది. ఆ తరువాత ఈనెల 12న సమావేశం అన్నారు. తమ పార్టీ కార్యక్రమం నేపథ్యంలో ఈ సమావేశాన్ని వాయిదా వేశారు. 13వ తేదీ అన్నారు. ఆ సమావేశాన్ని కూడా వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న క్రమంలో కౌన్సిల్ సమావేశాలు నిర్వహించరాదని వాయిదా వేసినట్లు చెబుతున్నారు. ముందస్తు ఆలోచన లేకుండా సమావేశ ఏర్పాటుకు అజెండా సిద్ధం చేయడం, కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వడం వంటివి జరిగిపోతున్నాయి. తీరా ఆ తేదీకి సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటన విడుదల చేస్తున్నారు. సమావేశానికి అజెండాలో మార్పులు జరిగే అవకాశం ఉందని టీడీపీ కౌన్సిలర్లు చెబుతున్నారు. పుత్తూరు మున్సిపాలిటీలో జరిగిన అవినీతి పట్ల ఇటీవల శాసనసభలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ లేవనెత్తిన అంశం తెలిసిందే. ఈ విషయంపై కూడా టీడీపీ కౌన్సిలర్లు సమావేశంలో ప్రశ్నించనున్నట్లు సమాచారం. వైసీపీ కౌన్సిలర్లు తమ వార్డుల్లో అంటే తమ వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలంటూ పోటీ పడుతుండటంతో ఛైర్మన్‌కు తలనొప్పిగా మారుతోంది. ఈ క్రమంలో కౌన్సిల్ సమావేశాలను వాయిదా వేస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు.

మా ప్రాంతంలో మద్యం దుకాణం వద్దు

● మున్సిపల్ కమిషనర్‌కు లక్ష్మీనగర్‌వాసుల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

పుత్తూరు అర్బన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణం ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటు సరికాదని లక్ష్మీనగర్ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. పుత్తూరు - చిత్తూరు మార్గంలోని తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ శాఖ ఎస్ఐ శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారని, దాన్ని విరమించుకోవాలన్నారు. ద్రౌపది తిరునాళ్ల జరిగే మంచినీళ్ల గుంట, పాఠశాలలు, హాస్పిటల్, లైబ్రరీ ఉన్నాయని తెలియజేశారు. నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారి కావడంతో మద్యం దుకాణం ఏర్పాటు చేయరాదన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో స్థానికులతో పాటు టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ధనపాల్ ఉన్నారు. ప్రభుత్వం గీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణం ఏర్పాటుకు పట్టణంలో అడ్డంకులు తలెత్తుతున్నాయి. ఈసలాపురం వద్ద ఏర్పాటును అక్కడి ప్రజలు అడ్డుకున్నారు. ఇప్పుడు పుత్తూరు - చిత్తూరు జాతీయ రహదారిలో అడ్డంకులు ఎదురవుతున్నాయి.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

పుత్తూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక పున్నమి సర్కిల్ వద్ద వైసీపీ నాయకుడు కుమారస్వామి రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పుత్తూరు మండల పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. ఎంపీపీ మునివేలు, లోకనాథం, మున్సిపల్ ఛైర్మన్ హరి, వైస్‌ఛైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈగల్ క్లబ్ ప్రారంభం



ప్రసంగిస్తున్న ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య

పుత్తూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాల నివారణకు ఈగల్ క్లబ్‌ను ఏర్పాటు చేశామని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం అనర్థాలపై బుధవారం కళాశాలలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మురుగా రెడ్డి మాట్లాడుతూ... మాదక ద్రవ్యాలను వినియోగించినా, విక్రయించినా కొత్త చట్టాల మేరకు కఠిన శిక్షలు పడతాయని ఫలితంగా బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని హెచ్చరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు

పుత్తూరు అర్బన్, మార్చి12(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగిస్తున్న ప్లాస్టిక్ నియంత్రణకు పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ చర్యలు చేపట్టారు. బుధవారం వ్యాపారులతో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా పేపర్ బ్యాగులను వినియోగించాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు.

భూతవాహనంపై దేవేరులతో స్కందుడి విహారం



పుత్తూరు టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరుపతి రోడ్డులో కొలువై ఉన్న వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి స్వామి ఆలయ 53వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి దేవేరులతో స్వామి వారు భూతవాహనంపై విహరించారు. అంతకు ముందు ఉదయం స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి భూతవాహనంపై దేవేరులతో అధిష్ఠించి పట్టణంలో విహరిస్తున్న స్వామివారికి స్థానికులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఉదయం 11 గంటలకు కలశాభిషేకం నిర్వహిం చారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ప్రత్యేక పూజలతో ధ్వజావరోహణంతో వార్షిక బ్రహ్మోత్సవాల ముగిశాయి.

శ్రీకాళహస్తి సత్యవేడు

ముక్కంటి సేవలో టీడీపీ యువ నాయుడు అజయ్‌సజ్జా



శ్రీకాళహస్తి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని టీడీపీ యువనాయుడు అజయ్ సజ్జా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. సుజిత్‌కుమార్‌రెడ్డి, కోబాకు లక్ష్మణ్, చరణ్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం తహసీల్దార్ కార్యాలయం ముట్టడి



కార్యాలయాన్ని ముట్టడించిన దళితులు, సీపీఐ నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలాల కోసం మండలంలోని కనమనంబేడు గ్రామ దళితులు సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. రెం టడు నెలలుగా దళితులు ఇంటి స్థలాల కోసం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపడుతున్నారు. ఇంటి స్థలాలు ఇవ్వకపోవడంతో బుధవారం నుంచి దీక్షలు చేపడుతామని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలకు వేసిన షామియానాను రెవెన్యూ సిబ్బంది తొలగించడంతో ఆగ్రహించిన దళితులు సీపీఐ నాయకులతో కలసి కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని జీవో ఇచ్చినప్పటికీ తహసీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. దళితులకు ఇంటి పట్టాలు ఇచ్చే వరకు దీక్షలు చేపడుతామన్నారు. అనంతరం సీపీఐ ఏరియా కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్ మాట్లాడుతూ... వీఎస్‌పురం దళితులు సాగు భూములు కోసం పది సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్న పట్టించుకోలేదన్నారు.బినామీ పట్టాలు సృష్టించిన వారికి మద్దతు పలుకుతున్నారని తెలిపారు. తక్షణం భూమి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ సుబ్రమణ్యం మాట్లాడుతూ... కమనంబేడు దళితుల ఇంటి పట్టాల జాబిత సిద్ధం చేశా మని, అనుమతి కోసం ఆర్డీవో, కలెక్టర్‌కు నివేదిస్తున్నట్లు చెప్పారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్ఐ విశ్వనాథ నాయుడు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కలప వ్యాపారికి తీవ్రగాయాలు



గాయపడిన గురవయ్య

శ్రీకాళహస్తి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కలప వ్యాపారి తీవ్రంగా గాయపడ్డాడు. తొట్టంబేడు మండలం కొమ్మనగుంటకు చెందిన గురవయ్య కలప వ్యాపారం చేస్తుంటాడు. ఇటీవల మహాశివరాత్రి సందర్భంగా దీక్షను స్వీకరించాడు. బుధవారం ఉదయం సింగమాలలోని శివాలయాన్ని దర్శించుకునేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. చిన్నసింగమాల వద్ద పీఎన్ రహదారి అండర్ పాస్ వంతెన కింద వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మినీ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో గురవయ్య కాలు విరిగింది. స్థానికులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారుల కొరడా



నిర్మాణాలను అడ్డుకుంటున్న రెవెన్యూ అధికారులు

వరదయ్యపాళెం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం, సత్యవేడు మండలాల సరిహద్దులో పారిశ్రామిక నగరానికి పరిసర ప్రాంతంగా ఉన్న వీకేఆర్‌పై కాలనీలో బుధవారం రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నారు. తహసీల్దారు రాజశేఖర్ ఆదేశాలతో వీఆర్వోలు చలపతి, హనీఫ్ సిబ్బందితో వీకేఆర్‌పై కాలనీకి చేరుకున్నారు. నిర్మాణ దశలో ఉన్న కట్టడ పనులను అడ్డుకున్నారు. ఇక్కడ నిర్మాణాలకు సరైన అనుమతులు లేవని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు పాల్పడితే కేసులు తప్పవని హెచ్చరించారు.

ప్రయాణికుల పట్ల గౌరవంగా ప్రవర్తించండి

రేణిగుంట, మార్చి 12, (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లు ప్రయాణికుల పట్ల గౌరవంగా ప్రవర్తించాలని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం సాయంత్రం కేఎల్ఎం హాస్పిటల్ కూడలిలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆటో డ్రైవర్లు నడుచుకోవాలని సూచించారు.

వనరుల మేరకు సాగు చేయాలి

వరదయ్యపాళెం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా చెరవులోని సాగునీటి వనరుల మేరకు పంట సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి గౌరి సూచించారు. వరికి నీరు అధికశాతంలో అవసరం ఉందన్నారు. పంట కోత దశకు చేరే సమయంలో చెరువలో నీరు అవసరాల మేరకు తగిన స్థాయిలో అందక వేలాది రూపాయల వ్యయంతో వేసిన పంట ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. నీటి వనరులను బట్టి పరిమిత స్థాయిలో సాగు చేయాలని కోరారు. ఇక వడదెబ్బ సోకే ప్రమాదం ఉన్నందున రైతులు ఉదయాన్నే వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి చేరుకోవాలన్నారు. తమ వెంట నీరు, మజ్జిగ వంటివి ఉంచుకోవాలని ఆమె సూచించారు.

వైసీపీ 15వ ఆవిర్భావ దినోత్సవం

శ్రీకాళహస్తి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ అధ్యక్షుడు అంజూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వి.సుధాకర్‌రెడ్డి, కంఠా ఉదయ్‌కుమార్, చంద్రశేఖర్, సురేష్, సాధన మున్నా రాయల్, బుల్లెట్ జయశ్యాం తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): సత్యవేడులో వైసీపీ ఆవిర్భావ వేడుకలు ఆ పార్టీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు.

రెండు గ్రూపులుగా...

పిచ్చాటూరు పట్టణంలో బుధవారం వైసీపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవాలను రెండు వర్గాలు వేర్వేరుగా జరుపుకున్నారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.భాస్కర్‌నాయుడు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో వేర్వేరుగా జరిగాయి. నాగలాపురం పట్టణంలోని వైఎస్ విగ్రహం వద్ద వైసీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు ఆధ్వర్యంలో, అలాగే జడ్పీటీసీ సభ్యురాలు సుమతి, ఎంపీపీ సింధూ ఆధ్వర్యంలో వేర్వేరుగా వేడుకలు జరిగాయి.

వృత్తితో పాటు ఆరోగ్యంపై దృష్టి పెట్టండి

సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అశోక రాజు



ప్రసంగిస్తున్న అశోక రాజు

నారాయణవనం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ వృత్తిలో స్థిరపడాలనుకునేవారు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెట్టాలని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కొండూరు అశోక రాజు చెప్పారు. బుధవారం ఇంజనీరింగ్ కళాశాలలో జుబిలేషన్ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో స్థిరపడేందుకు కృషి చేయాలని, దాంతో పాటు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం ఆడిటోరియంలో స్పోర్ట్స్ డే నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈనెల 13న జరిగే కార్యక్రమానికి జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్ సుదర్శనరావు హాజరవుతారని తెలిపారు. ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దన రాజు పాల్గొన్నారు.

హాస్టల్‌లో అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో హజ్మీ కచోకాసెన్ తదితరులు

సత్యవేడు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ బాలుర హాస్టల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం అదనపు గదులను నిర్మించేందుకు శ్రీసిటీలోని ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ పరిశ్రమ ముందుకొచ్చింది. కార్పొరేట్ సామాజిక సేవలో భాగంగా రూ.52 లక్షలతో గదులను నిర్మించేందుకు పరిశ్రమ ఎండీ హజ్మీ కచోకాసెన్ చేతుల మీదుగా బుధవారం భూమిపూజ నిర్వహించారు. హాస్టల్‌లో 98 మంది వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్నారు. 40 ఏళ్ళ క్రితం నిర్మించిన ఈ హాస్టల్‌లో చాలీచాలని గదులతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దీంతో స్పందించిన పరిశ్రమ యాజమాన్యం నూతన గదులు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి జ్యోత్స్న, ఎంఈవో రవి, ఏఎస్‌డబ్ల్యు కృష్ణయ్య, వార్డెన్లు గంగాధరం, జయకుమారి, రామయ్య, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

మా పిల్లలను బయట గ్రామాల బడికి పంపం



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కేవీబీపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరమాల పాఠశాల వద్ద బుధవారం 3, 4, 5 తరగతులు చదివే విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను బయట గ్రామాల బడులకు పంపమని నిరసన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా 3, 4, 5 తరగతుల పిల్లలను పక్క గ్రామం గుంటిపేడు ప్రాథమిక పాఠశాలకు పంపాలని అధికారులు ప్రతిపాదించారు. దీనికి సూరమాల వాసులు ఒప్పుకోకపోగా బడి మాన్పించేస్తామని భీష్మించారు. సూరమాల పాఠశాలలో 25మంది విద్యార్థులు ఉండగా 3, 4, 5 తరగతులకు చెందినవారు 16మంది ఉన్నారు. 16మంది పిల్లలను ప్రభుత్వం, విద్యాశాఖ తీసుకున్న నిర్ణయం ప్రకారం పంచాయతీలో ఒకే పాఠశాలలో ఉండాలని అధికారుల నిర్ణయం.

ఎమ్మెల్సీ దువ్వాడపై చర్యలు తీసుకోండి



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న జనసేన నేతలు

శ్రీకాళహస్తి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు బుధవారం డీఎస్పీ నరసింహమూర్తికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొట్టే సాయి మాట్లాడుతూ... అసెంబ్లీ సమావేశాల ప్రారంభం రోజున ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పవన్ కల్యాణ్‌ను వ్యక్తిగతంగా దూషించడమే కాకుండా రూ.50కోట్లు తీసుకుంటున్నాడని, అలాగే జనసేన కార్యకర్తలను సైకోలని మాట్లాడటం తగదన్నారు. ఈ కార్యక్రమంలో జి.చంద్ర, చిరంజీవి, వేణు, పగడాల ప్రతాప్, ఢిల్లీబాబు, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించండి



పాతబస్టాండు వద్ద ఆక్రమణలను పరిశీలిస్తున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ఆక్రమణలు తొలగించాలని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి సూచించారు. బుధవారం పట్టణవ్యాప్తంగా సిబ్బందితో కలిసి డీఎస్పీ సంచరిస్తూ ఆక్రమణదారులకు అవగాహన కల్పించారు. పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో వ్యాపారులు రోడ్లపైకి చొరబడటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. ప్రజా సౌకర్యం దృష్ట్యా ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ తిమ్మయ్య పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళా సాధికారత



సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు మహిళా నేతలు

శ్రీకాళహస్తి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీ మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని తెలుగు మహిళలు అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో వారు బుధవారం మీడియాతో మాట్లాడుతూ ... ఇంటిని సమర్థవంతంగా నడిపే మహిళ రాజకీయాల్లో మరింతగా రాణించగలదని గుర్తించిన ఎన్టీఆర్ పురుషులతో సమానంగా మహిళలకు ఆస్తిహక్కు కల్పించారన్నారు. అందుకు కొనసాగింపుగా సీఎం చంద్రబాబు మహిళల స్వావలంబనకు డ్వాక్రా పథకానికి శ్రీకారం చుట్టి వారి జీవన స్థితిగతులను మార్చారన్నారు. మాజీ సీఎం జగన్ తన తల్లి, చెల్లిని ఇంటిని నుంచి గెంటివేశాడన్నారు. ఆయనకు మహిళల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. వన్ టైం సెటిల్‌మెంట్ పేరుతో ఒక్కో మహిళ నుంచి సుమారు రూ.30వేల వరకు బలవంతంగా వసూలు చేసి టిడ్కో ఇళ్లు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. జగన్ పాలనలో మహిళలపై నేరాలు పెరగాయని చప్పారు. వైసీపీ నిర్వీర్యం చేసిన డ్వాక్రా సంఘాలకు పూర్వవైభవం తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సుమతి, మల్లీశ్వరి, రేణుకాదేవి, అనిత, కుమారి, చంద్రమ్మ, అమరావతి, తులసి, దాక్షాయని, గజలక్ష్మి, సుమతి, పద్మజా తదితరులు పాల్గొన్నారు.